ప్రజా కలం Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



శుక్రవారం | 29-05- 2026 | సంపుటి: 17, సంచిక: 56, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


### చివరి గింజ వరకూ మద్దతు ధరతో

# ధాన్యం కొనుగోలు చేస్తాం

## - రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు
- ఇసుక రవాణా వాహనాలను ధాన్యం కొనుగోలుకు వినియోగించాలి
- డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు
- మే నెలాఖరులోగా యాసంగి కొనుగోళ్లు పూర్తి చేయాలి
- ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన మంత్రి ఉత్తమ్



పెద్దపల్లి,మే 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు.వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే

తరువాయి 2వ పేజీలో...



### పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమం..

# ప్రభుత్వ ధ్యేయం

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

- మోడల్ సోలార్ గ్రామాల పథకంలో తొలి విడతగా రాష్ట్రంలో 81 గ్రామాల ఎంపిక
- పీక్ డిమాండ్ 18,542 మెగావాట్లకు చేరినా కోతలు లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా
- తడిసిన 9214 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు
- కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మించి తెలంగాణలో ధాన్యం కొనుగోలు
- తెలంగాణ కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రం తీసుకోవాలి

మధిర బోనకల్, మే 28( ప్రజా కలం న్యూస్)

పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం బోనకల్ మండలం గార్లపాడు గ్రామంలో మోడల్ సోలార్ గ్రామాల పథకంలో భాగంగా వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన 7.5 కిలోవాట్ సోలార్ ప్లాంట్లను ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ, రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్రంలో మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమం క్రింద రాష్ట్రంలో తొలి విడతలో 81 గ్రామాలను ఎంపిక చేసి ప్రతి గృహానికి 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లు,

తరువాయి 2వ పేజీలో...

# ప్రతి పౌరుడికి సమగ్ర సంక్షేమ కార్డు

## - ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 28 (ప్రజాకలం) :

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డ్ ) రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డ్ ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం ఈ విషయాన్ని ప్రత్యేకంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డ్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్ మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానించాలన్నారు.లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ఉండాలని సీఎం సూచించారు ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డ్ తో లింక్ చేయాలని చెప్పారు. కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు.



### ఫ్యూచర్ సిటీలో భూములకు

## రికార్డు ధరలు

- రావిర్యాలలో రూ.83,500 పలికిన చదరపు గజం భూమి
- విక్రయాల ద్వారా రూ 140 కోట్లు ఆదాయం
- హౌసింగ్ బోర్డు స్థలాలకు భారీ డిమాండ్

హైదరాబాద్, మే 28 (ప్రజాకలం) :

రాజధాని క్యూర్ పరిధిలో పెద్దపెద్ద వెంచర్లు చేపట్టడానికి అనువుగా ఉన్న భూములకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అందులోనూ ఎటువంటి వివాదాలు లేకుండా క్లియర్ టైటిల్ లతో ప్రభుత్వానికి చెందిన హౌసింగ్ బోర్డ్ స్థలాలకు డిమాండ్ మరింత భారీగా ఉంటోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, ఫ్యూచర్ సిటీ ఎంట్రన్స్ లో ఎయిర్ పోర్టుకు సమీపంలోని రావిర్యా ల లో భూములను కొనుగోలు చేయడానికి అనేక మంది పోటీపడ్డారు.

తరువాయి 2వ పేజీలో...

### ప్రపంచానికే తలమానికంగా

# 'ఫ్యూచర్ సిటీ'

- ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం
- FCDA కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు

హైదరాబాద్, మే 28 (ప్రజాకలం) :

ప్రపంచానికే తలమానికంగా ఉండేలా "ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, డి .శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం నాడు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ప్రతిష్టాత్మక "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న

తరువాయి 2వ పేజీలో...



### మేము కట్టిన ఒక్కో ఇల్లు

# 7 ఇందిరమ్మ ఇండ్లతో సమానం



- పేదల స్వగృహ స్వప్నాలను మేం సాకారం చేశాం..
- ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాదే
- డబ్బా ఇండ్లు కాకుండా, డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించాం
- హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించిన ఘనత తమదే... : కేటీఆర్

హైదరాబాద్, మే 28 (ప్రజాకలం) :

గతంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతాం అని చాలెంజ్ చేసిన మంత్రి పొంగులేటికి ఆ మాట నిలబెట్టుకునే దమ్ముందా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. మంత్రి తాను చేసిన సవాలుకు కట్టుబడి ఉండాలన్నారు. ఈ విషయమై మంత్రి పొంగులేటి చాలెంజ్‌కు ప్రతి సవాలు విసిరారు. హైదరాబాద్ నగరంలో ఇండ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తనదైన స్టైల్‌లో స్పందించారు. సవాళ్లు చేయడం, ఆపై పారిపోవడం నీతిలేని కాంగ్రెస్ నేతలకు అలవాటేనని.. కేవలం శపథం చేయడం కాదని, చేతనైతే చేసి చూపించాలన్నారు. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే ప్రజల గుమ్మం తొక్కి ఓట్లు అడుగుతాం అన్న సవాల్‌కు పౌరుషం ఉంటే కట్టుబడి ఉండాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దమ్ముంటే మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామని ప్రతినబూనాలని సవాల్ విసిరారు.

**పేదల స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం..**

ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ తమదని కేటీఆర్ ఉద్ఘాటించారు. స్వరాష్ట్రాన్ని సాధించామని, పేదల స్వగృహ స్వప్నాలను సాకారం చేశామన్నారు కేటీఆర్. డబ్బా ఇండ్లు కాకుండా, డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించామన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




### తెలుగు జాతి ఆత్మగౌరవ

# శిఖరం ఎన్టీఆర్



- ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు
- ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

2

## చివరి గింజ వరకూ మద్దతు ధరతో

# ధాన్యం కొనుగోలు చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లర్లకు ఏవైనా నష్టాలు వచ్చినా ప్రభుత్వం భరిస్తుందని,రైతులకు మాత్రం నష్టం జరగనివ్వమన్నారు.రైతుల చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు,వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు.రాబోయే 4 నుంచి 5 రోజుల పాటు ఇసుక రవాణా నిలిపివేసి వాహనాలను పూర్తిగా ధాన్యం రవాణాకు వినియో గించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా,ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. డిసెంబర్ 2023 తర్వాత కనీస మద్దతు ధర విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తూ రైతులకు ఇప్పటివరకు అదనంగా రూ.16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు.ప్రస్తుతం వర్షాల కారణంగా కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తడిసిందని,ఆ ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

**ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు**
**-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని చెప్పారు.కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సార్లు ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ ఎక్కడా ఒక్క కిలో ధాన్యానికి కూడా తరుగు పేరుతో కోత విధించలేదన్నారు. జిల్లాలో ఎక్కడైనా రైతుల నుంచి ఒక్క కేజీ ధాన్యం తరుగు తీసినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా మిల్లర్ల చేత రైతులకు పరిహారం ఇప్పిస్తామని హెచ్చరించారు.

**రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు**
**-ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు**

ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని,అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు కోరారు.రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అలాగే వర్షానికి తడిచిన,రంగు మారిన ధాన్యన్ని కొనుగోలు చేపిస్తామని అన్నారు.రైతుల పక్షాన ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. బీజేపీ రైతు గోస అని రైతుల కలల్లో తిరగడం సిగ్గుచెట్టు అని అన్నారు. వడ్లు,మక్కలు కొనుగోలు చేసేది కేంద్ర ప్రభుత్వం,కానీ మహారాష్ట్ర,ఛత్తీస్గఢ్ రాష్ట్రల్లో బీజేపీ డబల్ ఇంజన్ ప్రభుత్వం ఉండగా అక్కడి రైతులు తెలంగాణకి వచ్చి మక్కలు అమ్ముకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రతి పక్షాలు చేస్తున్న విమర్శలు సరికాదని అన్నారు.

**లక్ష్యం దిశగా యాసంగి ధాన్యం సేకరణ**
**-పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష**

జిల్లాలో యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి వంద శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఆన్‌లైన్ ఎంట్రీలు,ట్రక్ షీట్ జనరేషన్,రైతుల చెల్లింపుల్లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో 6.9 లక్షల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 5.7 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగంలో ఉన్నాయని, ఇంకా 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులో ఉ ందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సమర్థవంతంగా కొనసాగుతున్నాయని,ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి అవసరమైన నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**185 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ**
**-భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్**

యాసంగి సీజన్ లో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 185 కోనుగోలు కేంద్రాల ద్వారా 65 వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి పెద్దపల్లిలో 20 వేల వరంగల్ లో 20 వేల మెట్రిక్ టన్నుల, హన్మకొండ లో 10 వేల మెట్రిక్ టన్నులు మిల్లింగ్ కొరకు పౌరసరఫరాల శాఖ అలాట్మెంట్ చేసిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో హార్వెస్టింగ్ కొన్ని ప్రాంతాలలో ఆలస్యంగా జరుగుతుందని, చాలా మండలాలో ఇంకా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావాల్సి ఉందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు వంద మట్టి,ఇసుక రవాణా వాహనాలను కూడా ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో స్టోరేజీ ప్లేస్ తక్కువగా ఉన్నందున ఇతర జిల్లాల మిల్లులకు కూడా ట్యాగ్ చేయాలని కోరారు. అంతకుముందు పెద్దకల్వల ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య సురేష్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ జిల్లా సహకార అధికారి శ్రీమాల,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని కాళిందిని, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం



మొదటి పేజీ తరువాయి...

వ్యవసాయ మోటార్లకు 7.5 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లను మొత్తం 1380 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు.
ఖమ్మం జిల్లాలో 27 గ్రామాల పరిధిలో 445 కోట్ల వ్యయంతో 16,837 గృహాలు, 4,371 వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెల్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
నాణ్యమైన విద్యుత్ సరఫరా ద్వారా వ్యవసాయం, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని, తద్వారా రాష్ట్ర పురోగతి వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.
2023-24లో రాష్ట్ర పీక్ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం అది 18,542 మెగావాట్లకు చేరుకుందని, కేవలం రెండున్నర సంవత్సరాల్లో 3 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ పెరిగినా ఎక్కడా చిన్న అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు.
విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి ఉత్పత్తి పెంపు, అదనపు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టడం వల్ల విద్యుత్ గ్రిడ్ ఎక్కడా కుప్పకూలకుండా సరఫరా జరుగుతోందన్నారు. పీక్ డిమాండ్ ఎంత పెరిగినా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
నాణ్యమైన విద్యుత్ సరఫరా కారణంగా రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, అంచనాలకు మించి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తోందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.
అకాల వర్షాల కారణంగా కొన్నిచోట్ల ధాన్యం తడిసినా ప్రభుత్వం వెంటనే స్పందించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9214 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని గుర్తించి చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు చేస్తామని, ఆ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకోకుండా ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు.
గత రెండున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉ త్తమ్ కుమార్ రెడ్డి పలు మార్లు కేంద్ర పౌరసరఫరాల మంత్రితో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కలిసి తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా స్వీకరించాలని కోరినా సానుకూల స్పందన రాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంలో భారత ఆహార సంస్థ కేవలం సగం మాత్రమే కొనుగోలు చేస్తోందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా భాజపా నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్ 2025-26లో కేంద్ర ప్రభుత్వం 60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఇవ్వగా తెలంగాణ ప్రభుత్వం 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. రబీ సీజన్‌లో కేంద్రం 51.60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని, మరో 75 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు.
తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని డిప్యూటీ సీఎం డిమాండ్ చేశారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యానికి మించి ధాన్యం కొనుగోలు చేయడం వల్ల తెలంగాణ ప్రభుత్వం రైతులకు 17 వేల కోట్లు మద్దతు ధర కింద చెల్లించిందన్నారు.
గత పాలకులు 2014 నుంచి 2023 వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, గత రెండున్నర సంవత్సరాల్లో తమ ప్రభుత్వం ఎంత కొనుగోలు చేసిందో లెక్కలతో సహా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, మహానేత వైఎస్సార్ ఈ పథకాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు.
తెలంగాణ ప్రభుత్వం మద్దతు ధరతో పాటు సన్నరకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ అందిస్తోందన్నారు. మొక్కజొన్న పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయడం వల్ల ప్రతి రైతు 20 వేల నుంచి 25 వేల వరకు లాభపడ్డారని తెలిపారు.
జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, 2 లక్షల 67 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించడం జరిగిందన్నారు. చింతకాని, ముదిగొండ, బోనకల్ మండలాల్లో ధాన్యం కొనుగోలు కొంత మేరకు పెండింగ్‌లో ఉ ందని, మరో వారం రోజుల్లో పూర్తిస్థాయిలో కొనుగోళ్లు పూర్తి చేస్తామని తెలిపారు.
ధాన్యం రవాణా కోసం ఎవరికి ఎలాంటి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సీరియల్ నెంబర్ వారీగా లారీలను పంపిస్తూ రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసుకునే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ధాన్యం రవాణా కోసం డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రెడ్కో ఎండీ అనిల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ ఈ శ్రీనివాస చారి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచానికే తలమానికంగా 'ఫ్యూచర్ సిటీ'

మొదటి పేజీ తరువాయి...

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టును ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని కి సంబంధించిన తేదీల పై గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులు రాబోయే తరాలకు ఆధునిక తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు.
భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే నగరంగా ఫ్యూచర్ సిటీ ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని, గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన అనేక ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎదురైన అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోందని, ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది యువతకు ఉ పాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.
ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రులు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ కె. శశాంక, ఐఏఎస్, మహేశ్వరం డీసీపీ శ్రీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో భూములకు రికార్డు ధరలు

మొదటి పేజీ తరువాయి...

ఈ ప్రాంతలో ఉన్న హౌసింగ్ బోర్డు భూములకు గురువారం నాడు ఇ-ఆక్షన్ ద్వారా వేలం నిర్వహించారు. మొత్తం నాలుగు భూమలకు నిర్వహించిన వేలం పాటలో చదరపు గజం భూమి గరిష్టంగా రూ.83,500 కు అమ్ముడు పోయిందని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వెయ్యి నుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నాలుగు లాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలం పాట ద్వారా సుమారు రూ. 140 కోట్లఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ భూములను ఇ-ఆక్షన్ లో వేలం పాట ద్వారా విక్రయిస్తున్నట్లు గత నెలలో హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 17 సంస్థలు పోటీ పడ్డాయి.
ఇందులో 1113 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమిని కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీ పడ్డారు. రూ.26 వేల కనీసధరను నిర్ధారించగా, దీనిని దక్కించుకోడానికి పోటీ పడుతూ చదరపు గజం రూ.83,500 కు ఒక డెవలపర్ సంస్థ దక్కించుకుంది. అలాగే ఇదే ప్రాంతంలోని సుమారు 6 వేల చదరపు గజాల విస్తీర్ణంలోని భూమి వేలం పాటలో చదరపు గజం రూ.62,500 ధరకు అమ్ముడు పోయింది. అంతే కాకుండా సుమారు 13,500 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు పోటీ పడ్డారు. ఈ నాలుగు భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ. 140 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

# మేము కట్టిన ఒక్కో ఇల్లు 7 ఇందిరమ్మ ఇండ్లతో సమానం

మొదటి పేజీ తరువాయి...

హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించిన ఘనత తమదేనని కేటీఆర్ గుర్తుచేశారు. తాము 70 వేలతో అగ్గిపెట్టె ఇండ్లు కట్టలేదని, తాము కట్టిన ఒక్కో గృహం 7 ఇందిరమ్మ ఇండ్లతో సమానమన్నా రు. చరిత్రలో ఎవరూ ఎప్పుడూ చేయని సాహసంతో, 60 ఏండ్లు ఏలిన పార్టీలకు ఎన్న డూ రాని ఆలోచనతో దేశానికి నమూనాగా అందమైన పొదరిల్లను నిర్మించి చూపించామ ని తెలిపారు. మీకు చిత్తశు ద్ధి, సత్తా ఉంటే అంతకు మించి హైదరాబాద్‌లో డబుల్ బెడ్ రూం గృహాలను కట్టాలని సవాల్ చేశారు.

**ఇండ్లు కట్టింది మేం..**
**బుల్డోజర్లతో కూలగొడుతున్నది మీరు!**

గృహ నిర్మాణ యజ్ఞం చేసిన నిర్మా తలం తామైతే, గృహ మేధ యాగం చేస్తున్న విధ్వంసకులు కాంగ్రెస్ నేతలని కేటీఆర్ మండి పడ్డారు. ఇటుకలు పేర్చి ఇండ్లు కట్టింది తామైతే, పేదల ఇండ్లమీద బుల్డోజర్లు ఎక్కించి కూలగొడుతున్న క్రూరులు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీకెండ్‌లో మంది కొంపలు కూల్చి వికృతానందం పొందు తున్న మీరు ఇండ్లు కట్టడం గురించి మాట్లాడ టానికి సిగ్గుండాలి కదా అని ఎద్దేవా చేశారు. గత రెండున్నరఏండ్లలో నగరంలో కట్టిన ఇండ్లు ఎన్ని? పడగొట్టిన ఇండ్లు ఎన్ని? అనే దానిపై శ్వేత పత్రం ప్రకటించే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. దీపావళికి బాంబులు పేలుస్తామ ని చెప్పి తుస్సు మనిపించిన 'తుపేల్ మినిస్టర్', 'మిస్టర్ బాంబులేటి' అంటూ పొంగులేటిపై కేటీఆర్ తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

**దందాలు చేసి దండుకునే ల్యాండ్ గేమ్స్ మాకు తెలియవు**

తమకు తెలంగాణ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టడం, ఆత్మాభిమానంతో బతకడం మాత్రమే తెలుసని కేటీఆర్ స్పష్టం చేశారు. మీలాగా కోహినూరు హోటల్లో కాళ్లు పట్టుకొని, ఢిల్లీకి లొంగిపోయి కేసుల నుంచి తప్పించు కునే ఉపాయం తమకు తెలియదన్నారు. అడ్డదారుల్లో కొడుకు కంపెనీకి వేల కోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకునే అవినీతి కిటుకులు, అక్రమ క్రషర్లు నడుపుతూ అడ్డగోలుగా ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టే చిట్కాలు తమకు తెలియవన్నారు. రెవెన్యూ శాఖను అడ్డుపెట్టుకొని భూభారతిలో బ్లాక్ లిస్టులు, బ్లాక్ మెయిల్ దందాలు చేసి దండుకునే ల్యాండ్ గేమ్స్, గూండాలను ఉసిగొల్పి సామాన్యులపై దౌర్జన్యాలు చేసి భూములను బుక్క పట్టడం తమకు తెలియవని స్పష్టం చేశారు. అలాగే, బడుగు బలహీన వర్గాల నేతల మీద అహంకారంతో పేపర్లు విసిరికొట్టడం కూడా తమకు తెలియదన్నారు. ప్రభుత్వం ఎన్ని పనికిమాలిన ప్రగల్భాలు పలికినా, ఎన్ని డైవర్షన్ డ్రామాలు ఆడినా.. 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టబోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నించకుండా విడిచిపెట్టబోమని కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవ శిఖరం ఎన్టీఆర్

### - ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు - ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

పెద్దపల్లి,మే 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం,విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, స్వర్గీయ మాజీ సీఎం నందమూరి తారకరామారావు సమాజానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు కొనియాడారు. మహానాయకుడు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని గురువారం పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్టీఆర్ కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అని ఎమ్మెల్యే విజయ రమణారావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన ముఖ్యంగా అధికారంలో ఉన్న కాలంలో పేద,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారని గుర్తుచేశారు. ఆ చారిత్రాత్మక పథకాలు క్షేత్రస్థాయిలో పేదలకు అంది,వారి జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో నిరంతరం శ్రమించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని,అందుకే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని




కొనియాడారు. రాబోయే తరాలు కూడా ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని,ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య,ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఉప్పు రాజు,మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ కూర మల్లారెడ్డి,మాజీ జడ్పీటిసి బండారి రాంమూర్తి,స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు,ఎన్టీఆర్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

### - ఈద్గా ల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ




జగిత్యాల్ ప్రతినిధి మే 28 (ప్రజా కలం) బక్రీద్ ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ముస్లిం సోదర,సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినాన్ని శాంతి, సామరస్య వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జగిత్యాల,కోరుట్ల లో గల పలు ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ప్రార్ధనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని తెలిపారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. పండుగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లావ్యాప్తంగా నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# బక్రీద్ పర్వదినం సందర్భంగా సామూహిక ప్రార్థనలు

## ఈద్గాల వద్ద నమాజ్ నిర్వహించిన ముస్లింలు - మత సామరస్యాన్ని చాటేలా గోవధ నిషేధం

ఎండపల్లి, మే 28 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్, ఎండపల్లి మండలాల లో త్యాగం, భక్తి, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్–ఉల్–అధా) పర్వదినాన్ని ఉమ్మడి వెల్గటూర్ మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వ హించారు. ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం అల్లాహ్ ఆజ్ఞను శిరసావహిస్తూ తన కుమారుడిని సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడిన మహోన్నత ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉద యాన్నే ముస్లిం సోదరులు స్నానమాచరించి నూతన వస్త్రాలు, శిరస్సుపై టోపీ ధరించి గుల్లకోట, శాఖాపూర్, అంబారి పేట, జగదేవ్‌పేట, పాతగూడూర్ గ్రామాల్లోని ఈద్గాల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈద్ నమాజ్‌లో పాల్గొని దేశ ప్రజల శాంతి, సౌభ్రాతృత్వం, సుఖ సంతోషాలు, సమాజ శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు బక్రీద్ పర్వదిన విశిష్టతను వివరిస్తూ త్యాగనిరతి, దయ, కరుణ, సేవాభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. పవిత్ర ఖురాన్ బోధనలను అనుసరిస్తూ స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి ప్రేమ, సోదరభావం, పరస్పర గౌరవంతో జీవించాలని పిలుపునిచ్చారు. మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడుస్తూ సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని పేర్కొన్నారు. బక్రీద్ ఖుర్బానీ సందర్భంగా మత సామరస్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో గోవధను పూర్తిగా నిషేధించి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పారు. అన్ని మతాల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని, సామాజిక ఐక్యతకు కట్టుబడి ఉండాలని మత పెద్దలు సూచించారు. అనంతరం ముస్లింలు



పరస్పర ఆలింగనం చేసుకుని ఈద్ శు భాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో ఉమ్మడి మండల మాజీ కో–ఆప్షన్ సభ్యులు మహ్మద్ రియాజ్, మహ్మద్ సలీం, ఇమామ్ మసూద్ అహ్మద్, సదర్ సాహెబ్‌తో పాటు ముస్లిం మత పెద్దలు ఫకీరోద్దీన్, రఫీ, తాజ్, అనీఫ్, అల్లీ సాబ్, నసీరుద్దీన్, అబ్దుల్లా, హఫీజ్, రహీం, సయ్యద్ హైదర్, సాదుల్లా, ముస్తఫా, శుక్రోద్దిన్, అప్సర్, నాసర్, నసీర్, బాబర్, అసీఫ్, రషీద్, జానీ, ముబారక్, పాషా, అజహరుద్దీన్, అమ్జాత్, హుస్సేన్, దస్తగిరి, షరీఫ్, ఫకీర్ తదితరులు పాల్గొన్నారు.

## మానాల సౌదీ సంఘం నూతన కార్యవర్గం

### - అధ్యక్షుడిగా బత్తిని సురేష్ గౌడ్

రుద్రంగి, మే 28, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన సౌదీ సంఘం సభ్యులు గురువారం నిర్వహించిన సమావేశంలో మానాల సౌదీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బత్తిని సురేష్ గౌడ్, క్యాషియర్‌గా యాసోజీ మురళిని ఎన్నుకున్నారు. సంఘం బోర్డు మెంబర్లుగా పుప్పాల గణేష్, జక్కు శంకర్, జక్కు రాజారాం, గుర్రపు సుధాకర్, ఓరగొండ శ్రీనివాస్, తాటికొండ గణేష్, లక్కాకుల రమేష్, గొల్లమడ గణేష్‌లకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ.. సౌదీలో ఉన్న మానాల గ్రామ ప్రవాసుల సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఆపద సమయంలో సభ్యులకు సహాయం అందించడం, గ్రామానికి సేవా కార్యక్రమాలు చేపట్టడం, సంఘ సభ్యుల మధ్య ఐక్యత పెంపొందించడం సంఘ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడు బత్తిని సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. సభ్యుల నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని అన్నారు. క్యాషియర్‌గా ఎన్నికైన యాసోజీ మురళి మాట్లాడుతూ, సంఘ నిధుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానాల సౌదీ సంఘం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి గ్రామ ప్రజలు, స్నేహితులు, సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.



# ధాన్యం కుప్పలపై అన్నదాతల అరిగోస

## – కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ధ్వజం



పెద్దపల్లి,మే28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఆరుగాలం కష్టపడి పంట పండించిన అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అడుగడుగునా అన్యాయమే జరుగుతోందని పెద్దపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి,మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం ఆయన పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌ను సందర్శించి,అక్కడ మొక్కజొన్న,వరి ధాన్యం కుప్పలపై నెల రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దాసరి మాట్లాడుతూ రైతులు తమ పంటను మార్కెట్‌కు తీసుకొచ్చి నెల దాటుతున్నా,ఇప్పటివరకు కేవలం 50 శాతం మాత్రమే తూకాలు వేశారని, మిగతా నగం మార్కెట్లోనే మూలుగుతోందని మండిపడ్డారు.అకాల వర్షానికి మొక్కజొన్నలు,వరి ధాన్యం తడిసి మొలకెత్తుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సాగు సమయంలో రైతుబంధు,యూరియా అందించడంలో విఫలమైన ఈ ప్రభుత్వం,తీరా పంట చేతికొచ్చాక బార్దాన్ సంచులు,సుతిలి కూడా రైతులే కొనుక్కుని, బస్తాలు నింపుకోవాల్సిన దుస్థితి తెచ్చిందని ధ్వజమెత్తారు.నిబంధనల ప్రకారం ఒక బస్తాకు 40 కిలోల 600 గ్రాములు తూకం వేయాల్సి ఉండగా,మిల్లర్లు తరుగు పేరిట క్వింటాలుకు 5 నుండి 6 కిలోల వరకు అదనంగా గుంజుకుంటూ రైతులను నిలువునా దోచుకుంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు.రాబోయే రెండు మూడు రోజుల్లో మళ్లీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున,ఎలాంటి కాలయాపన చేయకుండా యుద్ధప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు.అకాల వర్షానికి తడిసిన,మొలకెత్తిన ప్రతి గింజనూ ప్రభుత్వమే పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని,తరుగు పేరిట దోపిడీకి పాల్పడుతున్న మిల్లర్లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రైతును రాజు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొనకపోతే,రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్,మండల పార్టీ అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్‌తో పాటు పలువురు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లాపూర్ మండల యువజన కాంగ్రెస్ ఇంచార్జి గా జవిడి రాజా రెడ్డి

మల్లాపూర్ మే 28 ( ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల యువజన కాంగ్రెస్ ఇంచార్జ్‌గా జావిడి రాజారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బిరం రాజేష్ ఆదేశాల మేరకు కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు చేరవేసేందుకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో యువకులను చేర్చుకొని గ్రామ కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు పెంట ప్రణయ్, నియోజకవర్గ కమిటీ ఇన్చార్జ్ అమ్ముల రాహుల్,సహబజ్ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ కు వినతి

### ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం - సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ధర్మపురి, మే 28 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా అందిన పలువురు ఆశా వర్కర్లు రాష్ట్రంలోని ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా హకు చెందిన పలువురు ఆశా వర్కర్లు గురువారం రోజున ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో మంత్రి అడ్లూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్య మంత్రి యనమల రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని మంత్రి తెలిపారు. దశలవారీగా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్క రిస్తామని ఈ సందర్భంగా మంత్రి ఆశా వర్కర్లకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

# ప్రమాదవశాత్తు బావిలో పడి మైనర్ బాలుడు మృతి

### - తన కుమారుడి మృతి పై పరమాల మహేష్ పై అనుమానం ఉన్నదని తండ్రి ఫిర్యాదు

### - కేసు నమోదు చేసిన బుగ్గారం ఎస్సై - క్రైమ్ నెంబర్ 59/2026 యు/సెక్షన్ 194 బిఎన్ఎస్ఎస్

బుగ్గారం, మే 28 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన బాలుడు తేది 28.05.2026 గురువారం రోజున బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధి లో చిన్నాపూర్ గ్రామానికి చెందిన మృతుడి కేసు వివరాలు ఫిర్యాదు ప్రాథమిక దర్యాప్తు లో తెలిసిన వివరాల ప్రకారం చిన్నాపూర్ గ్రామానికి చెందిన ఒర్సు శ్రీనివాస్ తండ్రి నర్సయ్య వయసు 45 సంవత్సరాలు వృత్తి గొర్ల కాపరి తన చిన్న కుమారుడు ఒర్సు శివకుమార్ వయస్సు 11 సంవత్సరాలు, అను బాలుడు గొర్లు చూసుకోవడానికి పరుమాల మహేష్ తండ్రి గంగాధర్ వయసు 27 సంవత్సరాలు గ్రామం చిన్నాపూర్ బుగ్గారం మండలం, అను వ్యక్తితో ఉంచి మధ్యాహ్నం సమయం లో తండ్రి ఇంటికి వెళ్లినాడు. అనంతరం మధ్యాహ్నం సుమారు 02:00 గంటల సమయం లో పరిమల మహేష్ ఫోన్ చేసి బాలుడు కనబడడం లేదని విషయం తెలిపి వెంటనే అక్కడికి రావాలని శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చి నాడు. శ్రీనివాస్ అక్కడికి వెళ్లగా చిన్నాపూర్ గ్రామ శివారు లోని అంతడుపుల రామలింగయ్య వ్యవసాయ బావిలో బాలుడి చెప్పులు కనిపించాయి. మృతుడి తండ్రి, మహేష్ గ్రామస్థులు బావి లో వెతకగా ఒర్సు ప్రభాకర్ అను వ్యక్తి బాలుడిని బావిలో నుండి బయటకు తీసినాడు. పరుమాల మహేష్ తెలిపిన వివరాల ప్రకారం, బాలుడు బాత్రూం కి వెళ్తానని చెప్పి వెళ్లి అనంతరం బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మునిగిపోయి నట్లు తెలిసినది. అయితే తన కుమారుడి మరణం పై పరుమాల మహేష్ పై అనుమానం ఉన్నదని ఫిర్యాదుదారు తెలిపినాడు. ఈ మేరకు బుగ్గారం ఎస్సై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుగ్గారం ఎస్సై జి సతీష్ తెలిపారు.



## స్టాక్ మార్కెట్లో ఏఐ కంపెనీలు

ముంబై : ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టిస్తున్న ప్రకంపనలు గ్లోబల్ స్టాక్ మార్కెట్ ముఖచిత్రాన్నే మార్చేస్తున్నాయి. దలాల్ స్ట్రీట్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా సగర్వంగా వెలుగొందుతున్న భారత్‌ను.. ఒక చిన్న దేశమైన తైవాన్ వెనక్కి నెట్టేసింది. ఈ ఊహించని దెబ్బతో అమెరికా, చైనా, జపాన్, హాంకాంగ్‌ల తర్వాత ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా తైవాన్ అవతరించి సంచలనం సృష్టించింది.తాజా అంచనాల ప్రకారం తైవాన్ స్టాక్ మార్కెట్ విలువ 4.95 ట్రిలియన్ డాలర్లకు చేరుకోగా, భారత మార్కెట్ విలువ 4.92 ట్రిలియన్ డాలర్ల వద్ద నిలిచి ఆరో స్థానానికి పడిపోయింది. తైవాన్ మనల్ని ఇలా ఒక్కసారిగా దాటేయడం వెనుక ఉన్న అసలు బలం.. 'ఏఐ' . కృత్రిమ మేధకు అవసరమైన అత్యాధునిక హార్డ్‌వేర్, చిప్‌లను తయారు చేయడంలో ప్రపంచంలోనే రారాజుగా ఉన్న 'తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ' ఈ అద్భుతాన్ని సుసాధ్యం చేసింది. ఒక్క టీఎస్ఎంసీ షేర్ల దూకుడుకే మార్కెట్ లెక్కలు మారిపోయాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి ఆ కంపెనీ షేర్లు ఏకంగా 49 శాతం లాభాలను కురిపించాయి. తైవాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీలో ఏకంగా 42 శాతం వాటా ఈ ఒక్క కంపెనీదే కావడం విశేషం. దీనికి తోడు దేశీయ ఫండ్స్ పెట్టుబడి పరిమితులను తైవాన్ ప్రభుత్వం సడలించడం కూడా అక్కడి మార్కెట్ బూమ్‌కు కలిసొచ్చింది. ప్రపంచమంతా ఏఐ జపంతో పరుగులు పెడుతుంటే, భారత్‌లో ఆ రంగంలో ప్రత్యక్షంగా సత్తా చాటే బలమైన టెక్ కంపెనీలు (డైరెక్ట్ ఏఐ ప్లేయర్స్) స్టాక్ మార్కెట్లో లేకపోవడం మనకు పెద్ద మైనస్‌గా మారింది. దీనికి తోడు అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు, మందగించిన కార్పొరేట్ కంపెనీల ఆదాయాలు వంటి కారణాలతో దేశీయ స్టాక్ మార్కెట్ గత కొంతకాలంగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఈ ప్రతికూల పవనాలే మన మార్కెట్ వృద్ధిని నెమ్మదించేలా చేశాయి.స్టాక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) పరంగా తైవాన్ మనకంటే ఒక అడుగు ముందుకు వేసినప్పటికీ.. ఇక్కడ గమనించాల్సిన మరో కీలక వాస్తవం ఉంది. వాస్తవ ఆర్థిక సామర్థ్యం, స్థూల దేశీయోత్పత్తి లెక్కల్లో చూసుకుంటే మాత్రం తైవాన్ కంటే భారతదేశమే ఎంతో పటిష్టంగా, మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక నిపుణులు భరోసా ఇస్తున్నారు.

## అక్రమంగా ఇసుక డంప్ లను నిల్వచేసిన వ్యక్తుల అరెస్ట్

కరీంనగర్ ప్రతినిధి మే 28 (ప్రజా కలం) మొగ్దుంపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో అ క్రమంగా ఇసుక నిల్వ చేసిన డంపు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెం టనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఇసుక డంపు కనిపించగా, సమీపంలో అనుమానాస్ప దంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు కిసాన్ నగర్ కరీం నగర్ కు చెందిన నీరుకుళ్ళ అనిల్, మొగ్దుంపూర్ గ్రా మానికి చెందిన వడ్లూరి మ ల్లేష్ గుర్తించారు. విచా రణలో నిందితులు మానేరు వాగు నుండి రాత్రి సమ యంలో అక్రమంగా ఇసు కను తవ్వి నిల్వ ఉంచి కరీం నగర్, పరిసర ప్రాంతాల్లో వి క్రయిస్తున్నట్లు ఒప్పుకోవడం జరిగింది దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని, అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసి పంచనామా నిర్వహించి, నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల ని మిత్తం కోర్టుకు తరలించిన ట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపా రు.




# క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ లో గెలిచిన వారికి బహుమతుల ప్రధానం

### - బహుమతులు ప్రధానం చేసిన ఎస్సై ఉదయ్ కుమార్, గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి




ఎండపల్లి, మే 28 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట ప్రీమియర్ లీగ్ సీజన్–1 లో భాగంగా గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా ఫైనల్ మ్యాచ్ ప్రదీప్–11 జం రాము 11 మధ్య ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్లో ప్రదీప్ –11 టీం అద్భుతమైన విజ యాన్ని అందుకొని మొదటి బహుమతి గెలుచుకోవడం జరిగింది. రెండవ బహుమతి రాము –11 టీం అందుకోవడం జరిగింది. ఈ టోర్నమెంట్ కు ముఖ్యఅతిథి గా ఉమ్మడి వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ పాల్గొని బహుమతులను వారి చేతుల మీదుగా క్రీడాకారులకు అందించడం జరిగింది. అలాగే వారు మాట్లాడుతూ యువత క్రీడల్లోను, ఉ ద్యోగాల్లో మంచి స్థాయికి వెళ్లి ఇంటికి పెద్ద కొడుకు లాగా ఉంటూ ఏ చెడు వ్యసనాల కు లోనవ్వకుండా గ్రామాభివృద్ధికి యువత తోడ్పడి ఆదర్శంగా నిలవాలని చెప్పడం జరిగింది.

అలాగే టోర్నమెంట్ నిర్వహించిన గ్రామ సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని కోరడం జరిగింది. ఈ టోర్నమెంట్ కు గ్రామ ప్రజలు యువకులు, క్రీడాకారులు మహిళలు సీనియర్ క్రీడాకారులు క్రీడాభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి తెలిపారు.

ప్రజా కలం

శుక్రవారం, మే 29, 2026

# విమర్శలు ఎందుకు?

'న్యాయవ్యవస్థ విశ్వసనీయత కోల్పోతే ఇక మిగిలేదేమీ ఉండదు. స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ జీవ లక్షణం. అది లేకపోతే.. న్యాయమూర్తులు ఉంటారు, కోర్టులు ఉంటాయి, తీర్పులు ఉంటాయి. అయితే వాటి హృదయమూ, ఆత్మ కనుమరుగైపోతాయి' అని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ (సుప్రీంకోర్టు న్యాయమూర్తి) అన్నారు. ఇటీవల పుణేలో వెలువరించిన ఒక స్మారకోపన్యాసంలో కేంద్ర ప్రభుత్వ అభీష్టం మేరకే ఒక హైకోర్టు న్యాయమూర్తిని బదిలీ చేస్తున్నామని కొలీజియం స్వయంగా తన మినిట్స్‌లో రికార్డు చేసిందని కూడా ఆయన వెల్లడించారు. రాజ్యాంగానికి నిబద్ధమై స్వతంత్రంగా వ్యవహరించాల్సిన న్యాయవ్యవస్థ ప్రభుత్వ ఒత్తిడికి లోనవుతూ పనిచేస్తోందని అనడానికి అది ఒక స్పష్టమైన నిదర్శనం. 'న్యాయవ్యవస్థ పార్టీ రాజకీయాలకు దూరంగా, దృఢ చిత్తంతో వ్యవహరించాలి. ప్రభుత్వంలో మార్పులకూ, న్యాయవ్యవస్థకూ ఏ మాత్రం సంబంధం ఉండకూడదు. అది అందరి పట్ల సదుద్దేశం, సానుభూతితో వ్యవహరించాలి కాని ఎవరి పక్షానా కొమ్ముకాయకూడదు' అని సుప్రీంకోర్టు ప్రారంభ సమావేశంలో తొలి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరిలాల్ జె కానియా ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 సంవత్సరాలు గడిచిపోయాయి. అది ఎలా అమలువుతుందని సమీక్షించుకుంటే సర్వోన్నత న్యాయస్థానంలో ప్రమాణాలు సమున్నతమయ్యాయా లేక దిగజారిపోయాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. నిజానికి మన రిపబ్లిక్ చరిత్రలో మొదటి పాతికేళ్లవరకు న్యాయవ్యవస్థ తన ఉనికిని కాపాడుకునేందుకు, ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పరిధిని నిర్ణయించడంలో తన వంతు బాధ్యతను నిష్పాక్షికంగా నిర్వర్తించింది. ముఖ్యంగా అధికరణలు 14, 15, 19, 31లను సుప్రీంకోర్టు నిర్వచించింది. ప్రాథమిక హక్కులను మార్చేందుకు ఏ మాత్రం వీలు లేదని 1967లో గోలక్‌నాథ్ కేసులో స్పష్టం చేస్తే, రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని మార్చే అధికారం పార్లమెంట్‌కు లేదని 1973లో కేశవానంద భారతి కేసులో మరింత తేటతెల్లం చేసింది. 1971లో అఖండమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ న్యాయవ్యవస్థతో చెలగాటమాడారు. ఆమె చర్యలకు వత్తాసు పలికిన న్యాయవ్యవస్థ పతనానికి పరాకాష్ఠ ఏడీఎం జబల్పూర్ కేసు. వేలాది రాజకీయ ప్రత్యర్థులను, జర్నలిస్టులను అరెస్టు చేసినప్పుడు ప్రజలు తమ ప్రాథమిక హక్కులను కాపాడుకునేందుకు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చా అని అడిగితే సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం అత్యంత దుర్మార్గమైన తీర్పు వెలువరించింది. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలకు ఆర్టికల్ 21 క్రింద జీవించే హక్కే లేదని ఆ ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు– ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏఎన్ రే, జస్టిస్ పి.భగవతి, జస్టిస్ ఎంహెచ్ బేగ్, జస్టిస్ వై.వి.చంద్రచూడ్ (రెండేళ్ల క్రితం సీజేఐగా రిటైరైన డివై చంద్రచూడ్ తండ్రి)–– ఏకగ్రీవంగా తీర్పునిచ్చారు. 'ఎమర్జెన్సీ పేరిట కాల్చి చంపినా అడగకూడదంటారా?' అని ఈ కేసులో నిరసన తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా ప్రశ్నించినప్పుడు 'మిలార్డ్, చట్టం అదే చెబుతున్నది' అని నాటి అటార్నీ జనరల్ జవాబిచ్చారట! న్యాయవ్యవస్థ చరిత్రలో చీకటి రోజులు అనదగిన ఎమర్జెన్సీ తర్వాత సుప్రీంకోర్టు ఎన్నో ఆత్మవిమర్శలు చేసుకుంది. ఎన్నో దిద్దుబాటు చర్యలను తీసుకుంది. ఎమర్జెన్సీ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టి మళ్లిస్తూ రాజ్యాంగమే సుప్రీం అని ప్రకటించింది. అనేక ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలకు అవకాశం కల్పించింది. జైలులో విచారణ లేకుండా కునారిల్లుతున్న వేలాది ఖైదీలను విడుదల చేసింది. కట్టుబానిసలను విముక్తి చేసింది. న్యాయవ్యవస్థలో నియమాకాలకు కొలీజియం పద్ధతిని ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రజల హక్కులను, పర్యావరణాన్ని, పనిచేసే మహిళల ప్రయోజనాలను పరిరక్షించింది. రాష్ట్ర ప్రభుత్వాలను ఇష్టారాజ్యంగా గద్దె దించడాన్ని అడ్డుకున్నది. చట్టసభల్లోనే ప్రభుత్వాలు మెజారిటీని నిరూపించుకోవాలని నిర్దేశించింది. వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీల ప్రయోజనాలకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులెన్నో. ఒక దశలో న్యాయవ్యవస్థ క్రియాశీలత అబ్బురపరిచేలా కనపడింది. ఇవాళ ఎమర్జెన్సీ రోజులు లేకపోవచ్చు. కాని న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయి. జస్టిస్ ఉజ్జల్ భుయాన్ లాంటి న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ స్వతంత్రతలో ఎవరూ చొరబడకుండా చూసుకోవాల్సిన అవసరం ఉన్నదని, న్యాయమూర్తుల రాజకీయ, సైద్ధాంతిక అభిప్రాయాలు బెంచ్‌లో నిర్ణయాలను ప్రభావితం చేయకూడదని అన్నారంటే తరిచి చూసుకోవాల్సిన అవసరం ఉన్నది. న్యాయమూర్తులు బయటి నుంచి వచ్చే ఒత్తిళ్లకు ప్రభావితం కాకూడదని, తమకొచ్చే ఆదాయంతో తృప్తిగా జీవించలేని న్యాయమూర్తులను వ్యవస్థనుంచే తొలగించాలని మరో ప్రస్తుత సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. ఒక కళంకిత న్యాయమూర్తి వ్యవస్థకే మచ్చలాంటి వాడని ఆమె వ్యాఖ్యానించారు. 'నిష్పాక్షికత న్యాయవ్యవస్థ ఆత్మ, స్వతంత్రత న్యాయవ్యవస్థ నరాల్లో ప్రవహించే రక్తం' అని ఒడిషా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మురళీధరన్ అన్నారు. ఆయన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు రాజధానిలో జరిగిన అల్లర్లపై పోలీసులను నిశితంగా ప్రశ్నించారు. దీంతో రాత్రికి రాత్రే ఆయనను మరో హైకోర్టుకు బదిలీ చేశారు. అసలు న్యాయమూర్తులే న్యాయవ్యవస్థ గురించి వ్యాఖ్యానించాల్సిన అవసరం ఎందుకు వస్తోంది? సామాన్య ప్రజలకు న్యాయం చేయాల్సిన, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సర్వోన్నత న్యాయస్థానం సంపన్నవర్గాలకు, ప్రభుత్వ ప్రయోజనాలకు, రాజకీయ నాయకులకు మాత్రమే అధికంగా ప్రతిస్పందిస్తోందని, పలుకుబడిగల వారికే వేగంగా తీర్పులు వస్తున్నాయని ఎందుకు విమర్శలు చెలరేగుతున్నాయి? ఒక కేసు ఫలానా బెంచి వద్దకు వెళితే ఫలానా నిర్ణయం వస్తుందని చెప్పగలిగే పరిస్థితి ఎందుకు వస్తోంది? ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా న్యాయవ్యవస్థపై రాజకీయ ప్రభావం, దళారీల పాత్రపై అత్యధికంగా చర్చ జరుగుతోంది. దేశం ఒక నియంతృత్వ రాజ్యంగా మారిపోతోందని, రాజకీయంగా సున్నితమైన కేసుల్లో న్యాయం కొరవడిందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దుశ్యంత్ దవే మాటలు కొట్టివేయవలసినవి కాదు. రాజకీయంగా సున్నితమైన కేసులను కొన్ని బెంచ్‌లకు కేటాయించడం, రిటైర్ అయిన తర్వాత లభించే పదవుల కోసం న్యాయమూర్తులు అర్రులు చాచడం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఎన్నికల కమిషన్ లాంటి వ్యవస్థలు బలహీనపడిపోయినా సుప్రీం పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కొలీజియంలో చర్చించే న్యాయమూర్తుల నియామకాలు, వారి బదిలీలు గతంలో ఎన్నడు లేనంతగా ప్రశ్నార్థకమవుతున్నాయి. న్యాయమూర్తులు ఉన్నత ప్రమాణాలు పాటించాలని, తమ ప్రవర్తన, తాము చేసే ప్రతి చర్య ప్రజల విశ్వాసం చూరగొనేలా ఉండాలని సుప్రీంకోర్టు 1997లో న్యాయవ్యవస్థలో విలువల గురించి ప్రకటించింది. అయితే ఇటీవలి కాలంలో ప్రధాన న్యాయమూర్తి, పలువురు న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది ప్రైవేట్ విమానాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు నగరాలకు పర్యటించడాన్ని 'కాంపైన్ ఫర్ జ్యుడిషియల్ అకౌంటబిలిటీ, రిఫార్మ్స్' అనే సంస్థ తీవ్రంగా విమర్శించింది. ఇది న్యాయవ్యవస్థ నైతిక ప్రమాణాలను ప్రశ్నార్థకం చేస్తోందని విమర్శించింది. ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి నివాసంలో భారీ ఎత్తున నోట్ల కట్టలు దొరకడం, దానిపై ఎలాంటి చర్యలు లేకపోవడం ఇలాంటి విమర్శలకు మరింత తావిస్తోంది. సమాజం, ముఖ్యంగా యువత ఈ పరిణామాలను గమనిస్తూనే ఉన్నది. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తమను బొద్దింకలతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలకు యువత అందుకే తీవ్రంగా ప్రతిస్పందించింది. ఎలాంటి పనీపాటలేని, ఉద్యోగం రాని యువత బొద్దింకల్లా తయారైందని, వారిలో కొందరు మీడియాలోను, మరికొందరు సోషల్ మీడియాలోనూ, ఆర్టీఐ కార్యకర్తలు, ఇతర కార్యకర్తలుగా తయారయ్యారని, వారు ప్రతి ఒక్కరిపై దాడి చేస్తున్నారని ఆయన ఒక కేసు విచారణ సందర్భంగా విమర్శించారు. తనను సీనియర్ న్యాయవాదిగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఒక న్యాయవాది దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించే సందర్భంగా తాను ఈ వ్యాఖ్యలు చేశానని, యువతను విమర్శించలేదని సూర్యకాంత్ వివరణ ఇచ్చినప్పటికీ ఆయన ఏమన్నారో అప్పటికే వైరల్ కావడంతో ప్రజలు ఆ వివరణను పట్టించుకునే స్థితి దాటిపోయింది. జస్టిస్ సూర్యకాంత్ ఆ వ్యాఖ్యలు చేసిన తర్వాత 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరిట ఒక యువకుడు సోషల్ మీడియాలో అకౌంట్ ఏర్పర్చుకున్నారు.





# ఘనంగా బక్రీద్ వేడుకలు

**- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు - పండుగ సందర్భంగా పోలీసుల భారీ బందోబస్తు**





మెట్ పల్లి(కోరుట్ల) ప్రతినిధి మే 28(ప్రజాకలం): మెట్ పల్లి డివిజన్ కేంద్రంతో పాటు ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఈద్గా మైదానాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ముస్లీం మత పెద్దల ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ నమాజును చదివారు. ఈ సందర్భంగా కుర్బానీ గొప్పతనం గురించి ముస్లిం సోదరులకు తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాను వేడుకోని దువా చేశారు.

ఈద్గా మైదానంలో ఆయా వార్డులకు చెందిన ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొని బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్ పల్లి డీఎస్పి రాములు ఆధ్వర్యంలో సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఎస్సై, అనిల్ , ఆర్ ఎస్ ఐ. రమేష్, ఎస్సై లు రాజ్ నాయక్, గంగాధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మెట్ పల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో ఈద్గా, మసీదుల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేశారు.

మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణ రావు, ఆయా వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

# భావితరాలకు ఆదర్శప్రాయుడు ఎన్టీఆర్

**- టిడిపి సీనియర్ నాయకుడు అక్కపాక తిరుపతి - ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు**



పెద్దపల్లి,మే 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలుగు ప్రజలందరికీ చిరస్మరణీయుడు, భావితరాలకు ఆదర్శప్రాయుడు తెలుగు ఆత్మగౌరవ నినాదాన్ని ప్రపంచం నలుమూలల చాటిన మహనీయుడు దివంగత నేత నందమూరి తారక రామారావు అని టిడిపి సీనియర్ నాయకుడు అక్కపాక తిరుపతి అన్నారు.స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకొని గురువారం పెద్దపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన నాయకులు,తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ధీశాలి ఎన్టీఆర్ అని,ఆయన ప్రవేశపెట్టిన పేదల సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. అనంతరం సీనియర్ తెలుగుదేశం నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించిన ఈ వేడుకల్లో మహానాడు వేదికగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలంగాణలో టీడీపీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రకటించడం పట్ల నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్త గ్రామ స్థాయి నుంచి శ్రమించి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పు రాజు,టిడిపి నాయకులు కోల కిషన్ రావు, పెరిక శ్రీనివాస్,తుమ్మల శ్రీనివాస్,చెన్నూరి రమేష్,దావళ్ళ శ్రీనివాస్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రంగిలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**- హాజరైన సీఐ రవీందర్**

రుద్రంగి, మే 28,(ప్రజాకలం ప్రతినిధి) త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదిన వేడుకలు గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. పండగ సందర్భముగా కొత్తబట్టలు ధరించి పండుగ వాతావరణంలో ఈద్గా వద్ద ప్రత్యేక పార్థనలు చేసారు.



ఈ కార్యక్రమానికి సీఐ రవీందర్, ఎస్ఐ మోతీరాం లు హాజరై ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సాదుల్లా తోపాటు పలువురు ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక బక్రీద్

**- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణ రావు**



పెద్దపల్లి,మే 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

త్యాగానికి,భక్తిశ్రద్ధలకు ప్రతీకయిన బక్రీద్ పండుగను పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట సమీపంలో గల చందపల్లి ఈద్గా వద్ద గురువారం బక్రీద్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అలయ్ బలయ్ వేడుకల్లో తెలంగాణ ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని,ముస్లిం సోదర సోదరీమణులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ముస్లిం సోదరులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు పంచుకున్న ఆయన, ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు,సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.మతసామరస్యానికి, సౌభ్రాతృత్వానికి వేదికగా నిలిచిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ధాన్యం నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

**- రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి**

**- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ , మే 28(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి, నిల్వలను వెంటనే గోదాములకు తరలించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. గురువారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు తీరును, నిల్వల పరిస్థితిని, రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారో, ఇంకా ఎంత కొనుగోలు చేయాల్సి ఉందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యపు సంచులను ఎప్పటికప్పుడు గోదాములకు, రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని లారీలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లారీల కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. రైస్ మిల్లుల సామర్థ్యం, ఇప్పటివరకు దిగుమతి అయిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే వాహనాలు నిలిచిపోకుండా వెంట వెంటనే అన్‌లోడింగ్ పూర్తి చేసి తిరిగి కేంద్రాలకు పంపించాలని సూచించారు. అవసరమైతే అదనపు హమాలీలను నియమించుకోవాలని మిల్లుల నిర్వాహకులకు తెలిపారు. అలాగే మిల్లుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని



ఆదేశించారు. కేంద్రంలో ఉన్న రైతులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతగా పనిచేసి గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ధాన్యం నిల్వలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గడువులోగా నిల్వలను గోదాములకు తరలించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ధాన్యం మెట్రిక్ టన్నుల వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ సందర్భంగా పెంచికల్‌పాడు గ్రామంలో ఐదెకరాల ప్రభుత్వ స్థలం ఉందని గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ తెలియజేయడంతో అక్కడ గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, కుంటాల తహసిల్దార్ కమల్ సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన వ్యక్తి అదృశ్యం

గొల్లపల్లి మే 28 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఎల్పుల మల్లయ్య 65 అనే వ్యక్తి ఈ నెల 13 నా ఉదయం 09 గంటల సమయంలో కొండగట్టు, వేములవాడ దైవ దర్శనానికి వెళు_న్నానని ఇంట్లో చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు.దీంతో వారి కుమారుడు ఎల్పుల రామయ్య పోలీసు స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు. అదృశ్యమైన ఎల్పుల మల్లయ్య అనే వ్యక్తి చామనచాయ రంగు కలిగి, ఎత్తు సుమారు 5.4 అడుగులు ఉండి, తెల్లని షర్ట్, తెల్లని ధోతి ధరించి ఉన్నాడని అతని ఆచూకీ తెలిసిన వారు వెంటనే గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.



## రవీంద్ర భారతిలో ఉత్తమ మహానంది అవార్డు అందుకున్న నేరెళ్ల కిరణ్ గౌడ్




ధర్మారం, మే 28 :( ప్రజా కలం ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బోట్లవనపర్తి గ్రామానికి చెందిన నేరెళ్ల కిరణ్ గౌడ్ కు మారుతి మ్యారేజ్ బ్యూరో తరపున 2025 – 2026 సంవత్సరానికి గాను గురువారం రోజున రవీంద్ర భారతి లో ఎక్కువ పెళ్లిళ్లు చేసిన వారికి తెలంగాణ రాష్ట్ర మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ ఆధ్వర్యం లో ఉత్తమ మహానంది అవార్డ్స్ ఇవ్వడం జరిగిందని. మారుతి మ్యారేజ్ బ్యూరో తరపున ఉత్తమ మహానంది అవార్డు అందుకున్న నేరెళ్ల కిరణ్ గౌడ్ తెలిపారు.

## వరిగడ్డి కట్టలతో వెళ్తున్న ట్రాక్టర్ విద్యుత్ తీగలకు అంటుకొని వరిగడ్డి కట్టలు బూడిద

### -పెను ప్రమాదం తప్పిన ట్రాక్టర్, డ్రైవర్



ఎండపల్లి, మే 28 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన అరిగెల మల్లయ్య ట్రాక్టర్ లో వరిగడ్డి కట్టలు పెట్టుకొని రాత్రిపూట కోడిపుంజులపల్లె రోడ్డు వెంబడి వెళ్తున్న క్రమం లో మహా లక్ష్మి పక్కకు ట్రాన్స్ఫార్మర్ నుండి వ్యవసాయ బావికి వెళ్లే విద్యుత్ తీగల కు ట్రాక్టర్ తో వెళ్తున్న వరి గడ్డి కట్టలు అంటుకొనడంతో వెంటనే డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్ ను రివర్స్ తీసి పక్కకు ట్రాక్టర్ జాకి లేపడం తో మంటలు అంటుకున్న వరిగడ్డి కట్టలు కింద పడ వేయడం తో ట్రాక్టర్, డ్రైవర్ కు పెను ప్రమాదం తప్పిందని వరిగడ్డ కట్టలు మాత్రం కాలి బూడిద అయినట్లు స్థానికులు తెలిపారు.

## ధరూర్ మండలంలో ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



గద్వాల ప్రతినిధి మే 28 (ప్రజా కలం న్యూస్) ధరూర్ మండలంలో బక్రీద్ పండుగను గురువారం ముస్లీం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు, ఉప్పేరు, చింతరేవుల వద్ద ఉన్న ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మజీద్ కమిటి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ముస్లీం సోదరులకు యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సమీర్ ముజాహిద్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ధరూర్ ఎస్ఐ నందీకర్ అధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న తహసిల్దార్

గద్వాల జిల్లా ప్రతినిధి మే 28 (ప్రజా కలం న్యూస్)



ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని గురువారం మల్దకల్ తాసిల్దార్ ఝాన్సీ రాణి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ వ్యవస్థాపక వంశీయుడు, శ్రీకృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కలియుగ వైకుంఠం మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయాన్ని దర్శించుకోవడం తమ అదృష్టమని తహసిల్దార్ దంపతులు తెలిపారు.

## మహిళా సంక్షేమ భవనానికి శంకుస్థాపన చేసిన కొండంపేట సర్పంచ్ బెల్లంకొండ జోష్ణ నరీన్ రావు

### - ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ట్రేడ్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి

మల్హర్, మే 28 ప్రజాకలం ప్రతినిధి : కొండంపేట గ్రామపంచాయతీలో నూతన మహిళా సంక్షేమ విఓ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం జరిగింది. గ్రామ సర్పంచ్ బెల్లంకొండ జోష్ణ నరీన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అయిత రాజి రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బడితల రాజయ్య, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ, ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, వల్లంకుంట సర్పంచ్ బొమ్మ రజిత రమేష్ రెడ్డి, ఉపసర్పంచ్ శనిగరం శ్రీకాంత్, గ్రామ శాఖ అధ్యక్షుడు చల్ల మల్లారెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు వార్డు సభ్యులు మోహన్ రెడ్డి, బద్రి లక్ష్మి మల్లయ్య, కొడిశాల మల్లేష్, కుంభ ముకుంద రెడ్డి, ఐల శరత్, మాజీ సర్పంచ్ పోటు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శనిగరం రాజయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు శనిగరం సంతోష్, అడ్దూరి మల్లేష్, ఐకేపీ ఏపీఎం, సీసీ మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం

# పూర్తిగా మోసం చేసింది

### బిఆర్ఎస్ పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు




గద్వాల ప్రతినిధి మే 28 (ప్రజా కలం న్యూస్) జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో మొన్న కురిసిన అకాల వర్షానికి తడిసి,మొలకెత్తిన ధాన్యాన్ని వడ్ల సెంటర్ ను పార్టీ నాయకులతో కలిసి గురువారం బాసు హనుమంతు నాయుడు పరిశీలించి,రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

రైతులు ఎన్నో ఆశలతో తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ రోజుల తరబడి పంటను రోడ్లపైనే పడేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు...ఇక ఇదే సమయంలో అకాల వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోయిన వడ్లు పూర్తిగా తడిసి మొలకెత్తాయని,రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని తెలిపారు. కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనం అవుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే గన్ని బ్యాగులు,హమాలి,లారీలు లేక రోజులు తరబడి కేంద్రాల్లో రైతులు పడికాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులు ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. గత 25 రోజుల నుంచి వడ్లను కొనుగోలు కేంద్రంలో ఉంచిన, మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కర్ణాటక రాష్ట్రం రాయచూర్ రైస్ మిల్ ప్రైవేట్ దళారులకు రైతులు వడ్లు అమ్ముకుంటున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి రైతులు తీవ్ర నష్టపోయారని ఆరోపించారు. అకాల వర్షానికి తడిసి, మొలకెత్తిన వడ్ల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పటేల్ జనార్ధన్ రెడ్డి,శేఖర్ నాయుడు,చక్రీధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,తిమ్మప్ప గౌడ్,రాముడు,పూడూరు రఘు నాయుడు,రమేష్, డ్యామ్ శ్రీను,రాము,వినయ్,తిమ్మప్ప, హరి కృష్ణ, మధు,మోహన్, భాస్కర్,నాగరాజు,కృష్ణ,రాజు,మహేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పానీపూరి తిని ఆస్పత్రుల పాలైన బాధితులను పరామర్శించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి మే 28 (ప్రజా కలం న్యూస్) జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో మూడు రోజుల క్రితం పానీపూరి బండి దగ్గర పానీ పూరి తిన్న 25 మందికి తీవ్ర అస్వస్థకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిన వెంటనే టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వెంకట్ రాములు, కురువపల్లయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐజ మున్సిపాలిటీ లో పానీపూరి వ్యాపారస్తులు చికెన్ సెంటర్ వ్యాపారస్తులు మరియు రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్ల వ్యాపారస్తులు విచ్చలవిడిగా పెట్రేగిపోతున్నారు. వీళు ౹ పూర్తిగా ప్రజలు తినే ఆహారం పట్ల నిర్లక్ష్యం వహిస్తూ కేవలం వ్యాపారం కోసం మాత్రమే నడుపుకుంటూ ప్రజల ప్రాణాలను గాల్లో కల్పేస్తున్నారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ వీళ్ళ పైన చర్యలు తీసుకోవాలి. వీళ్ళకు పర్మిషన్స్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అధికారుల నుంచి సర్టిఫైడ్ కూడా ఉండాలి. కానీ ఇవి ఏవి ఉండకుండా విచ్చలవిడిగా ఎక్కడ పడితే అక్కడ రోడ్ల పైన పెట్టి వ్యాపారం చేస్తున్నారు. తక్షణమే జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ కూడా తనిఖీ చర్యలు చేపట్టాలని



డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

క్రమంగా రోజురోజుకు పెరుగుతున్న బాధితుల సంఖ్య.. గట్టు మండలం గొర్లఖాన్ దొడ్డి గ్రామానికి చెందిన నలుగురికి తీవ్ర అస్వస్థకు గురికాగా గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో సరిగా పట్టించుకోకపోవడం వల్ల మరల గురువారం ఐజ ప్రభుత్వ దావఖానా లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించడం జరిగింది. గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మమల్ని పట్టించుకోకపోవడం లేదని బాధ్యతలు ఆవేదన చెందడం చాలా బాధాకరం తక్షణమే డాక్టర్లు బాధితుల పట్ల నిర్లక్ష్యం విడనాడి మెరుగైన చికిత్స అందించాలని తెలిపారు.

# ఎన్టీఆర్ జననమే ఒక చరిత్ర

### - సినీ, రాజకీయ రంగాల్లో చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్

### - ఎన్టీఆర్ కు కేంద్రం భారతరత్న ప్రకటించాలి: మాజీ ఎంపీ నామ.



ఖమ్మం, మే28( ప్రజా కలం న్యూస్ ) ఎన్టీఆర్ జననమే ఒక చరిత్ర అని బీఆర్ఎస్ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గురువారం నాడు ఖమ్మం నగరం లోని లకారం ట్యాంక్ బండ్ నందు ఉన్న 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలసి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు నివాళ్లు అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకుంటున్నట్లు బీఆర్ఎస్ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వ్యక్తిత్వం, సినీ మరియు రాజకీయ రంగాల్లో ఆయన సాధించిన ఘనతలు భావితరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తున్నాయని నామ తెలిపారు. తెలుగు చలనచిత్ర రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలు, రాష్ట్ర ప్రజల కోసం చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజకీయ నాయకుడిగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు.

ఎన్టీఆర్ తన హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. పటేల్–పట్వారీ వ్యవస్థ రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, రూ.2 కిలో బియ్యం, జనతా వస్త్రాల పంపిణీ, పేదలకు గృహ నిర్మాణాలు వంటి కార్యక్రమాలు సామాజిక న్యాయానికి నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ పథకాలు పేదలకు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో భరోసా కల్పించాయన్నారు. ఎన్టీఆర్కు భారతరత్న ప్రకటించడం తెలుగు ప్రజల చిరకాల కోరిక అని నామ పేర్కొన్నారు. ఆయన దేశానికి, తెలుగు జాతికి చేసిన సేవలను గుర్తించి భారతరత్న పురస్కారం ప్రకటించాలని తాను 17వ లోక్సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం ఆనాడు పార్లమెంటరీ పార్టీ నేతగా ఉండి 15వ లోక్సభలో తాను చేసిన పోరాటం అలాగే ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల సహకారం, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో పాటు నాటి లోక్సభ స్పీకర్తో ప్రత్యేకంగా మాట్లాడి పార్లమెంట్ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు జరిగిందన్నారు. ఎన్టీఆర్ మరణించిన 17 సంవత్సరాల తర్వాత 2013 తాను తాను ఎంపీ గా ఉన్న సమయంలో ఆ విగ్రహం ఏర్పాటులో భాగస్వామ్యం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అంతేకాకుండా ఖమ్మంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, తెలుగు జాతి గర్వించదగ్గ మహానేతకు ఇది నిజమైన నివాళిగా నిలిచిందని పేర్కొన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటు కార్యక్రమాల్లో కూడా తాను భాగస్వామ్యం అయినట్లు తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఆయా ప్రాంతాల్లో విగ్రహాల ఏర్పాటుకు కృషి చేసినట్లు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

కేసీఆర్ కూడా తన హయాంలో ఎన్టీఆర్ లా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, బొల్లం మల్లయ్య యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్ కుమార్, ఆర్జేసీ కృష్ణ తో పాటు పలు మండలాల నుండి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## తానూర్ మండలంలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు



తానూర్, మే 28(ప్రజా కలం): మండల కేంద్రమైన తానూర్ తో పాటు మండలంలోని కోలూర్, మొగిలి, మసల్గా, జౌలా (బి), బేంబర్, నందిగాం, ఎల్వీ, మరియు దహగాం గ్రామాలలో గురువారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు, ఈ సందర్భంగా ఉదయం స్థానిక ఈద్గా, మసీదుల వద్దకు ముస్లింలు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ (పండుగ శుభాకాంక్షలు) తెలుపుకున్నారు, పరస్పర శుభాకాంక్షలతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది,త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ బక్రీద్ పండుగను అందరూ ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు.

## బక్రీద్ సందర్భంగా భైంసా పట్టణంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు

### - భైంసా పట్టణం లోని ఈద్గా వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,

నిర్మల్ మే28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) బక్రీద్ పండుగ సందర్భంగా భైంసా పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట పోలీస్ బందోబస్తును లినిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ తరపున పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఇది వరకే ఇరు వర్గాల ప్రజలతో శాంతి కమిటీ సమావేశాలను కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అంటే కాకుండా సోషల్ మీడియాలోని పుకార్లను, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని



తెలిపారు. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా అన్ని రకాల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలియ జేశారు. ఈ పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తో పాటు, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, సాయి కుమార్, ఎస్ఐ లు, ఆర్ ఎస్ ఐ లు,ఇంకా సిబ్బంది ఉన్నారు

## ప్రశాంతంగా ముగిసిన బక్రీద్ ప్రార్థనలు

### స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నిర్మల్ మే28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లాలోని నిర్మల్, భైంసా పట్టణాలలో బక్రీద్ పండుగ ప్రార్థనలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ స్వయంగా ప్రార్థనా స్థలాలను సందర్శిస్తూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మల్ పట్టణంలో ప్రార్థనలు ముగిసిన అనంతరం జిల్లా ఎస్పీ చిన్నారులని, ముస్లిం సోదరులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారితో ఆప్యాయంగా మాట్లాడి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు, అడిషనల్ ఎస్పీ ( అడ్మిన్) ఉపేందర్ రెడ్డి,నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, సాయి కుమార్, రవీందర్ నాయక్,గోవర్ధన్ రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, అజయ్,కిరణ్ ఆర్.ఐ లు రామ్ నిరంజన్ రావ్, శేఖర్ ఎస్ఐ లు, ఆర్.ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు.

## తల్లాడలో ఘనంగా బక్రీద్ పర్వదిన వేడుకలు

తల్లాడ మే 28 ( ప్రజా కలం న్యూస్ ):ముస్లిం సోదరులు బక్రీద్ పర్వదిన వేడుకలను తల్లాడ మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తల్లాడ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. ఒకరినొకరు అలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందూ, ముస్లిం భాయ్ భాయ్ అంటూ స్థానికులు వారికి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మతసామరస్యానికి, స్నేహ సంబంధాలకు బక్రీద్ పండగ ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పండుగను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్. ఈసూబ్, అక్బర్, మస్తాన్, బాబు, గాలిబ్, సొందు, బాబా, లాల్ మియా, మెహరాజ్, డాక్టర్ సైదా, జి క్రియ , మున్నా, జానీ, అజీజ్, యాకూబ్ పాషా, ముజిద్ మౌళి సాబ్, చందు పాషా, ముస్తఫా, సలీం, అజీజ్, రఫీ, అలీ, నాగులు మీరా, అన్వర్, జాన్ పాషా, బారల్లి, బాజీ, నిజాముద్దీన్, మదర , దాదా, లాల్మియా, సమీర్ యాకూబ్ పాషా సుభాని, బడే మియా, జానీ,అబ్దుల్ రెహామాన్, చిన్నారులు పాల్గొన్నారు.



## ఐకేపీ వీఓఏల సమస్యల పై పోరాటం చేస్తాం

### - బీజేపీ మండల అధ్యక్షులు బండ శ్రీకాంత్



మల్హర్, మే 28 ప్రజాకలం ప్రతినిధి : మలహర్ రావు మండల ఐకేపీ విఓఏ ల న్యాయమైన డిమాండ్లకు బీజేపీ మలహర్ రావు మండల శాఖ గురువారం పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు బండ శ్రీకాంత్ పటేల్ మాట్లాడుతూ..గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రి సీతక్క వీఓఏల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కుటుంబాలను వదిలి, తక్కువ జీతంతో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వీఓఏలకు కనీస వేతనం రూ. 20,000 ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏల పోరాటానికి బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, సమ్మయ్య, తోటపల్లి తిరుపతిరెడ్డి,సతీష్ రెడ్డి, ఎస్కే నిషాన్ పాష,రాళ్లబండి ప్రశాంత్, అశోక్,సాయి, రాగం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి విలేఖరి శ్రీరాం రమేశ్‌కు నివాళి

### - కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఖాదీ బోర్డు డైరెక్టర్ ఈగ మల్లేశం



మే 28 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /వర్దన్నపేట)వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ పత్రిక విలేఖరి శ్రీరాం రమేశ్ ఆకస్మిక మృతి పట్ల కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రమేశ్ మృతి వార్త తెలుసుకున్న ఆయన, వారి స్వగృహానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రజ్యోతికి వార్తలు అందిస్తూ ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చిన ఘనత శ్రీరాం రమేశ్‌కే దక్కుతుందని అన్నారు. వివాదరహితుడిగా, సౌమ్య స్వభావంతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. తనదైన రచనా శైలితో పాఠకుల మన్ననలు పొందిన జర్నలిస్టుగా రమేశ్ చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిలివేరు కుమారస్వామి,పెద్దూరి సంజీవరావు, సమ్మెటశ్రీను, కరిమిల్ల సంపత్‌రావు, భూషబోయిన సంపత్ యాదవ్, గుమ్మడి హరిబాబు, నందిపాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నాటసార్వభౌమునికి కి ఘన నివాళులు

### - ఎన్‌టీఆర్ సేవలకు భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి

మే 28 ప్రజాకలం ప్రతినిది: (హన్మకొండ)

తెలుగు ఉమ్మడి రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) 103వ జయంతిని పురస్కరించుకొని హన్మకొండ పబ్లిక్



గార్డెన్ సమీపంలోని ఆయన విగ్రహానికి అఖిల భారత సీనియర్ ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత సీనియర్ ఎన్‌టీఆర్ అభిమాన సంఘం గౌరవ అధ్యక్షులు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ కేవలం సినీనటుడిగానే కాకుండా తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం రాజకీయాల్లోకి అడుగుపెట్టి అతి తక్కువ సమయంలోనే చరిత్ర సృష్టించిన మహానేత అని కొనియాడారు.రెండు రూపాయలకే కిలో బియ్యం, పేదలకు పక్కా ఇళ్లు, మద్యపాన నిషేధం, మహిళలకు ఆస్తి హక్కు వంటి పలు సంక్షేమ, విప్లవాత్మక నిర్ణయాలతో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. తెలుగు నేల కు స్వంతకాలు, తెలుగు భాష ఉన్నంతవరకు ఎన్‌టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలుస్తారని అన్నారు.అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన తొలి నాయకుల్లో ఎన్‌టీఆర్ ఒకరని గుర్తుచేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఎన్‌టీఆర్‌కు భారతరత్న పురస్కారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పుల్ల రజనీకాంత్, చాద మరియమ్మ, రహీమ్, ముక్కిరాల జనార్దన్, హన్మకొండ సాంబయ్య, పిట్టల శ్రీనివాస్, ముంజు వెంకట్రావు గౌడ్, మాదాసి బాబు, కందుకూరు నరేష్, రవీందర్ గుప్తా, బైరపాక ప్రభాకర్, యాకుబ్, కాగితాల శంకర్, అనిల్, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషితో అభివృద్ధిలో దుసుకుపోతున్న వర్ధన్నపేట నియోజకవర్గం

### అభివృద్ధిపై ఎమ్మెల్యే తనదైన మార్క్ - పలాభిషేకాలుగా ప్రజల ఆశీస్సులు..

### అభివృద్ధిపై విమర్శలు చేయలేక విపక్షాలు అబసుపాలు

### విపక్షాల తప్పడు ప్రచారాన్ని ప్రజలే తిప్పికోడతారు

### వర్ధన్న పేట కాంగ్రెస్ నేత కొండేటి మహేందర్

మే 28 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ / వర్ధన్నపేట) వర్ధన్నపేట నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతుండటాన్ని చూసి విపక్షాలు ఓర్వలేక తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండేటి మహేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, ప్రజల విశ్వాసమే దీనికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.ఒక ప్రకటనలో మహేందర్ మాట్లాడుతూ,గత పదేళ్లలో వర్ధన్నపేటకు దక్కని అభివృద్ధి కేవలం రెండేళ్లలోనే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ఎమ్మెల్యే నాగరాజు అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, మున్సిఫ్ కోర్టు, 100 పడకల ఆసుపత్రి, సబ్ జైలు, మార్కెట్ యార్డు పునర్నిర్మాణం, కొనారెడ్డి చెరువు మత్తడి నిర్మాణం, ఆకేరు వాగుపై చెక్ డ్యామ్, గ్రామాల్లో ఎల్ఈడి వీధి దీపాలు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి పలు కీలక కార్యక్రమాలు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే సాధ్యమయ్యాయని కొనియాడారు.

**“ప్రజలే నాగరాజు పనితీరుకు బ్రాండ్ అంబాసిడర్లు”**

ఎమ్మెల్యే నాగరాజుపై ప్రజల్లో అపారమైన అభిమానముందని, అందుకే స్వచ్ఛందంగా ఆయన చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తున్నారని మహేందర్ పేర్కొన్నారు. ఇది రాజకీయ ప్రదర్శన కాదని... ప్రజల ప్రేమాభిమానాల ప్రతిబింబమని అన్నారు.గత ప్రభుత్వాల హయాంలో వర్ధన్నపేట అభివృద్ధి పరంగా వెనుకబడిపోయిందని, ప్రభుత్వ కార్యాలయాలు, గురుకుల పాఠశాలలు, మార్కెట్ యార్డులు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయని విమర్శించారు. అయితే మాజీ ఉన్నత పోలీస్ అధికారిగా సేవలందించిన నాగరాజు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ప్రజాసేవనే లక్ష్యంగా తీసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని వివరించారు.

**“వ్యక్తిత్వాన్ని నిర్ణయించేది ప్రజలే”**

ఎవరో కొందరు ఆరోపణలు చేస్తే నాయకుడి వ్యక్తిత్వం దెబ్బతినదని, ప్రజల విశ్వాసమే అసలైన న్యాయస్థానమని కొండేటి మహేందర్ స్పష్టం చేశారు. ఇదే



నియోజకవర్గంలో రెండుసార్లు గెలిచిన ప్రత్యర్థి పార్టీ అభ్యర్థిని ఓడించి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న నాయకుడు నాగరాజు అని పేర్కొన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి విపక్షాలు అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా విమర్శల రాజకీయాలకు స్వస్తి చెప్పి అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాలకు సూచించారు.

**యువతకు ఉద్యోగాలు... మహిళలకు ఆర్థిక చేయూత**

గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో చదువుకున్న యువత ఉద్యోగాల కోసం తీవ్ర నిరాశకు గురయ్యారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ యువతకు కొత్త ఆశలు నింపుతోందని తెలిపారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం బ్యాంకు లింకేజ్ రుణాలు, మహిళా క్యాంటీన్లు, మహిళా సంఘాలకు బస్సుల మంజూరు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళలను వ్యాపార రంగంలో ముందుకు తీసుకువస్తోందన్నారు. చిరు వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తూ కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు.

**“వర్ధన్నపేటలో అభివృద్ధి ఆగదు”**

ప్రజల ఆశీస్సులు, ప్రభుత్వ సహకారంతో వర్ధన్నపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృషి కొనసాగుతుందని కొండేటి మహేందర్ స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజలే తగిన సమయంలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## రాజకీయ బెదిరింపులకు భయపడం

### - సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి




గద్వాల ప్రతినిధి

రాజకీయ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని,చట్టబద్ధ రాజ్యాంగబద్ధ సంస్థలను అడ్డుపెట్టుకొని సిపిఎం నాయకత్వాన్ని బలహీనపరచలేరని, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ లో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పై జుణ దాడులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కేరళలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి,కాంగ్రెస్ కలయికతో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్ పై చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ సంస్థలను అడ్డం పెట్టుకొని దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని కించపరచడమేనని అన్నారు. రాష్ట్రానికి 15 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసి,నీతివంతమైన, ఆదర్శవంతమైన పాలన అందించిన వ్యక్తిపై ఉద్దేశపూర్వకంగా అవమానపరచడానికి ఆయనతో పాటు కుటుంబ సభ్యులపై ఏకకాలంలో ఈడి దాడులు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.ఈడి చెబుతున్న ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ గురించి ఎటువంటి ప్రస్తావన లేకపోయినప్పటికీ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులు సమర్ధనీయం కాదని విమర్శించారు.ప్రస్తుత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి లక్షల కోట్ల రూపాయల కుంభకోణం చేసిన ఎటువంటి చర్యలు తీసుకోలేదని, అవినీతిపరులు, అక్రమార్కులు బిజెపిలో చేరగానే పునీతులు అవుతున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, దేశం కోసం పోరాడుతున్న వారు మాత్రం బిజెపి వారి దృష్టిలో అవినీతిపరులవుతున్నారని విమర్శించారు. తమ రాజకీయ ప్రత్యర్థులైన అరవింద్ కేజ్రీవాల్, శిబు సోరేన్,మనీష్ సిసోడియా, వంటి వారిని ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక వారిపై కూడా అక్రమ కేసులు బనాయించి కక్ష సాధింపులకు దిగిందని విమర్శించారు. సమగ్ర విచారణ జరిగిన తర్వాత, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, కానీ కేవలం రాజకీయ ప్రతీకారంతో బిజెపి, కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వం చట్టబద్ధ రాజ్యాంగబద్ధ సంస్థల దుర్వినియోగాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. పినరయి విజయన్ కూతురుకు సంబంధించినటువంటి కంపెనీ వ్యవహారంలో పినరై విజయన్ కు ఎలాంటి సంబంధం లేదని గతంలో కోర్టు తీర్పులు ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా బిజెపి, కాంగ్రెస్ కలిసి ఈ దాడులు చేయించడం సరైనది కాదని అన్నారు. రాజకీయ వేధింపుల ద్వారా, సిపిఎం నాయకత్వాన్ని అక్రమ కేసులలో ఇరికించడం ద్వారానో బలహీనపరచలేదని ప్రజా ఉద్యమాలు నిర్మించి లౌకిక ప్రజాస్వామ్య శక్తుల ద్వారా బలపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ, నాయకులు రంగన్న, రామకృష్ణ,అంజి, రామకృష్ణ, నరసింహ, రామాంజనేయులు, అంజి,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ రూపురేఖలు!

### - మంత్రి పొంగులేటి ఆదేశాలతో రూపుదిద్దుకుంటున్న సమగ్ర మాస్టర్ ప్లాన్

### - చారిత్రక క్షేత్రంలో వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన.

పాలేరు మే 28(ప్రజా కలం న్యూస్ )

పాలేరు నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ క్షేత్రం అభివృద్ధి కోసం రూ. 2.50 కోట్ల నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. అయితే ఈ నిధులతో పాటు ఈ చారిత్రక క్షేత్రానికి అంతర్జాతీయ స్థాయి హంగులు అద్దేందుకు ఇంకా ఎంత వ్యయం అవుతుంది, ఎలాంటి పనులు చేపట్టాలనే అంశాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించిన నేపథ్యంలో గురువారం వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.

- డి.పి.ఆర్ రూపకల్పన కోసం ఉన్నత స్థాయి బృందం

తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాటి, బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటార్ సి.ఆంజనేయ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతాధికారులు, పురావస్తు నిపుణుల బృందం నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని విస్తృతంగా పరిశీలించింది. మంజూరైన రూ. 2.50 కోట్ల నిధుల వినియోగంతో పాటు, భవిష్యత్ నిధుల అంచనాలు, ల్యాండ్ స్కేపింగ్, పర్యాటక హంగుల రూపకల్పనపై నిపుణుల బృందం క్షేత్రస్థాయిలోనే సుదీర్ఘంగా సమీక్షించింది.



- ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ సర్వే

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, కేవలం ఉపరితల తవ్వకాలకే పరిమితం కాకుండా ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. దీనిద్వారా భూగర్భంలో దాగివున్న చారిత్రక అవశేషాలను శాస్త్రీయంగా వెలికితీసి రక్షించనున్నారు. అలాగే, పర్యాటక వసతుల విస్తరణ కోసం సుమారు నాలుగు ఎకరాల భూమిని సేకరించాలని తీర్మానించారు.

**- ఆధునిక పర్యాటక వసతులు..**ఇక్కడ పర్యాటకుల కోసం చరిత్రను ప్రతిబింబించే త్రీడీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఆడియో–విజువల్ గ్యాలరీలు, ఓపెన్ ఎయిర్ అంఫీ థియేటర్, అంతర్జాతీయ స్థాయి వాకింగ్ మార్గాలు, లైటింగ్ వంటి మౌలిక వసతులను ఈ నివేదికలో చేర్చనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు, పూర్తి వ్యయ అంచనాలతో కూడిన ఈ ‘సమగ్ర నివేదిక’ ను రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని వారసత్వ శాఖ డైరెక్టర్ వెల్లడించారు.

## ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీరామ్ రమేష్‌కు ఎమ్మెల్యే నాగరాజు నివాళి

### - పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే

### - కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా

మే 28 ప్రజాకలం ప్రతినిది:(వరంగల్ /వర్ధన్నపేట) వర్ధన్నపేటకు చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ శ్రీరామ్ రమేష్ మృతిపట్ల వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.





బుధవారం వర్ధన్నపేట మండల కేంద్రంలో శ్రీరామ్ రమేష్ పార్థివదేహాన్ని ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కె.ఆర్ దిలీప్ కలిసి సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోయిన శ్రీరామ్ రమేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జర్నలిజం రంగంలో శ్రీరామ్ రమేష్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కౌడగని రాజేష్ కన్నా, అంబేద్కర్ గ్రామ సర్పంచ్ చిటూరి రాజు, కౌన్సిలర్ సిరిపెల్లి వాణి కుమార్, కొత్తపెల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు తుళ్ల రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, ఎండీ చోటే, ఈగ దామోదర్, సమ్మెట సుధీర్, టెంపుల్ డైరెక్టర్ ఖీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్లపల్లి మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ

### ముఖ్య అతిథిగా హాజరైన ట్రైడ్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి

### సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్



మల్హర్, మే 28 ప్రజాకలం ప్రతినిధి : మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ మహిళా సమైక్య సంఘం భవన నిర్మాణానికి గురువారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, వారి సాధికారతకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని, ఈ భవనం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉప అధ్యక్షులు అయిత రాజిరెడ్డి, మండల అధ్యక్షులు బడితల రాజయ్య ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్, ఉప సర్పంచ్ వేల్పుల రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు జనగామ లక్ష్మిరాజు, మండల మహిళా అధ్యక్షురాలు, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, సిఏ సునిత, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ కు తీవ్ర గాయాలు

హైదరాబాద్ : పెద్ద అంబర్‌పేట్–హయత్ నగర్ జాతీయ రహదారిపై తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ లారీ.. ముందు వెళ్తున్న మరో లారీని బలంగా ఢీకొట్టడంతో, టిప్పర్ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ క్యాబిన్ లోపల తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయి మృత్యువుతో పోరాడాడు.హయత్ నగర్ వైపు నుండి ఆటో నగర్ వైపు వెళ్తున్న ఒక లారీ టైర్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆ లారీ రోడ్డు మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. అయితే, అదే సమయంలో అదే మార్గంలో వెనుక నుండి అతివేగంగా దూసుకొచ్చిన ఒక టిప్పర్ లారీ.. డివైడర్‌ను ఢీకొట్టి ఆగి ఉన్న లారీని వెనుక భాగం నుండి అత్యంత బలంగా ఢీకొట్టింది.ఈ ఘోర ఢీకొట్టుడు ప్రభావానికి టిప్పర్ ముందు భాగం పూర్తిగా నలిగిపోయింది. దీంతో డ్రైవర్ సీట్ లోనే కూరుకుపోయి, క్యాబిన్ ఇనుప రేకుల మధ్య తీవ్ర గాయాలతో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే హయత్ నగర్ పోలీసులు, 108 అత్యవసర సేవల సిబ్బంది యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకున్నారు.క్యాబిన్ పూర్తిగా నలిగిపోవడంతో డ్రైవర్‌ను బయటకు తీయడం పోలీసులకు సవాల్‌గా మారింది. గ్యాస్ కట్టర్లు, ఇతర పరికరాల సహాయంతో పోలీసులు, 108 సిబ్బంది సుమారు గంట సేపటి వరకు శ్రమించి క్యాబిన్ భాగాలను తొలగించారు. అత్యంత చాకచక్యంగా డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి, ప్రాథమిక చికిత్స అనంతరం చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంత సమయం పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదం...**గచ్చిబౌలి నుండి శంషాబాద్ వైపు వస్తున్న రెండు కార్‌లు డికోని ఏడు మందికి గాయాలు హైదరాబాద్ కమిషనరేట్ పరిధి ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధి రాళ్ళగుడా వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పై రెండు కార్‌లు డికొని ప్రమాదంమరుతి బెలునో, మహెంద్ర ఎక్స్‌యువి700 కార్‌లు డికొన్నయి. ప్రమాదంలో ఏడు మందికి సల్ప గాయులు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వారిని హాస్పిటల్ కు తరలించారుప్రమాదంపై ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పలు మార్కెట్ యార్డులో భారీ వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

పెద్దపల్లి : పెద్దపల్లి మార్కెట్ యార్డులో భారీ వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. తూకానికి సిద్ధంగా ఉన్న మక్కల బస్తాల్లోకి వర్షపునీరు చేరింది. మక్కలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, జగిత్యాల జిల్లా మెట్పల్లి వ్యవసాయ మార్కెట్లో ధాన్యం, మక్కలు తడిచిపోయ్యాయి. ఆ ధాన్యం, మక్కలను ఆరబోసుకుంటూ రైతులు అవస్థలు పడుతున్నారు. మెట్పల్లి మార్కెట్లో 4 వేల క్వింటాళ్ల మక్కలు, 6 వేల క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు సమాచారం. కరీంనగర్ జిల్లా చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లో కుడా ధాన్యం తడిసిపోయింది. నెలరోజులుగా ధాన్యం విక్రయానికి ఎదురుచూస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల బీభత్సంతో పెంచాలపల్లిలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

## ఎడ్లపల్లి మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ

### ముఖ్య అతిథిగా హాజరైన ట్రైడ్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి

### సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్

మల్హర్, మే 28 ప్రజాకలం ప్రతినిధి : మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ మహిళా సమైక్య సంఘం భవన నిర్మాణానికి గురువారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి, వారి సాధికారతకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం బాగుపడుతుందని, ఈ భవనం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉప అధ్యక్షులు అయిత రాజిరెడ్డి, మండల అధ్యక్షులు బడితల రాజయ్య ఎడ్లపల్లి సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్, ఉప సర్పంచ్ వేల్పుల రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు జనగామ లక్ష్మిరాజు, మండల మహిళా అధ్యక్షురాలు, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, సిఏ సునిత, నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పవన్ సరే.. బిజెపి సంగతేంటి!?

కాకినాడ : ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారంపై స్పందించారు పవన్ కళ్యాణ్. అమిత్ షా లాంటి గొప్ప వ్యక్తిని కలిసినప్పుడు అరెస్టులు గురించి ప్రస్తావిస్తామా? అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అంతటి పెద్దలను కలిసి విన్నవిస్తే.. ఇలా విశ్లేషించడం ఏంటని గట్టిగానే నిలదీశారు పవన్ కళ్యాణ్. అయితే ఇంతటి నిందారోపణలు పవన్ పై రాగా.. బిజెపి వ్యూహాత్మక మౌనం పాటించడం మాత్రం కూటమి ధర్మానికి విఘాతం కలిగిస్తోంది. తిరిగి బిజెపి పైనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిజెపి సైలెన్స్ ఎంతలా అంటే.. వైసిపి విషయంలో సాఫ్ట్ కార్నర్ అన్నట్టు ప్రజల్లోకి సంకేతాలు వెళ్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్ పై కూటమిలోని రెండు పార్టీలు గట్టిగా నిలదీస్తుండగా.. బిజెపి మాత్రం మౌనం వహిస్తోంది.ఆది నుంచి బిజెపి వైయస్సార్ కాంగ్రెస్ విషయంలో సాఫ్ట్ కార్నర్ తో ఉందన్న టాక్ ఉంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా దానిని బాగా హైలైట్ చేస్తోంది. తద్వారా తప్పనిసరి పరిస్థితుల్లోనే బిజెపి టిడిపి తో కలిసిందని.. అవసరమైన పక్షంలో వైసీపీ నుంచి పరస్పర రాజకీయ ప్రయోజనాలు అందుకునేందుకు సిద్ధంగా ఉందని ప్రచారం మొదలుపెట్టారు. జగన్మోహన్ రెడ్డి విషయంలో బిజెపి ఉదాసీనంగా ఉందని చెప్పడానికి ఆయన బెయిల్ రద్దు, వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణలో జాప్యం వంటి వాటిని ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు విశ్లేషకులు. ఈ క్రమంలోనే ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏకంగా పవన్ కళ్యాణ్ పై బాంబు పేల్చారు. అందుకు జనసేనతో పాటు పవన్ రియాక్ట్ అయ్యారు. కానీ టిడిపి విషయంలో బిజెపి ఆలోచన అది అని.. జగన్మోహన్ రెడ్డి శాశ్వత మిత్రుడు బిజెపి కని చెప్పారు ప్రొఫెసర్ నాగేశ్వర్. దానిని ఖండించాల్సిన అవసరం బిజెపికి ఉంది. లేకుంటే అదే నిజం అని జనాలు నమ్మక తప్పదు.ప్రొఫెసర్ నాగేశ్వర్ కమ్యూనిస్టు భావజాలం ఉన్న వ్యక్తి. పైగా ఆధారాలు లేకుండా బిజెపి అగ్రనేత ఆదేశాలు అన్నట్టు మాట్లాడారు. దానిని ఖండించాల్సిన బీజేపీ నేతలు ఇప్పుడు అదే నాగేశ్వర్ ను సమర్థిస్తున్నారు. తెలంగాణ బిజెపి నేత మురళీధర్ రావు ప్రొఫెసర్ నాగేశ్వర్ మంచి విశ్లేషకుడు అన్నట్టు కితాబు ఇచ్చారు. ఆయన తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్న తర్వాత కూడా పోలీస్ కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. దీంతో నాగేశ్వర్ చెప్పింది నిజమే అన్నట్టు సంకేతాలు ఇచ్చారు. అయితే ఆది నుంచి బిజెపి విధానం ఇదే. ఏపీతో వింత రాజకీయం ఆడుతోంది. ఇక్కడున్న రాజకీయ పరిస్థితులకు తగ్గట్టు వ్యవహరించి రాజకీయ లబ్ధి పొందుతోంది. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్లో మాత్రం బిజెపి వైఖరి ఇప్పుడు అంతటా చర్చ నడుస్తోంది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. తన సహచర మంత్రి నాదెండ్ల మనోహర్ తో ఢిల్లీ వెళ్లారు.. అక్కడ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో భేటీ అయ్యారు. అక్కడ వారి మధ్య ఏం జరిగిందో తెలియదు. కాకపోతే 25 నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. ఏం మాట్లాడుకున్నారో తెలియకపోయినాప్పటికీ.. మీడియాకు మాత్రం వచ్చే ఎన్నికల్లో కూడా మూడు పార్టీలు కలిసి పోటీ చేయాలని.. ఏపీ రాష్ట్రాన్ని బాగు చేయాలని చర్చించుకున్నట్లు చెప్పారు. ఇది ఇలా ఉంటే ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ మాత్రం మరో విధంగా చెప్పారు. జగన్మోహన్ రెడ్డిని అరెస్ట్ చేయాలని అమిత్ షా ముందు పవన్ కళ్యాణ్ ప్రతిపాదన తెచ్చారని.. దానికి ఆయన ఒప్పుకోలేదని.. జగన్మోహన్ రెడ్డిని తమ లాంగ్ టర్మ్ పొలిటికల్ ఫ్రెండ్ గా భావిస్తున్నట్టు అమిత్ షా చెప్పారని.. నాగేశ్వర్ అన్నారు.నాగేశ్వర్ అన్న ఈ మాటలు క్యాజువల్ గానే ఉండవచ్చు. పాలిటిక్స్ ను అంతర్గతంగా స్టడీ చేసే వారికి వేరే విధంగా అనిపిస్తాయి . ప్రొఫెసర్ నాగేశ్వర్ నుంచి ఎప్పుడైతే ఈ మాటలు బయటికి వచ్చాయో.. అప్పుడే వైసిపి మీడియా అలర్ట్ అయిపోయింది. వెంటనే తన సోషల్ మీడియా ద్వారా.. మీడియా ద్వారా కావలసిన ప్రచారం చేసుకుంది. ఇది ఏపీ రాజకీయాలలో ఎంత మంట పుట్టించాలో అంత మంట పుట్టించింది. ఆ తర్వాత జనసేన రంగంలోకి వచ్చింది. టిడిపి.. బిజెపి ఇలా ఎదురుదాడి మొదలైంది. మొత్తంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యవహారం మరో లైన్ తీసుకుంది.ఈ క్రమంలో నాగేశ్వర్ తనను తాను సెల్ఫ్ డిపెండ్ చేసుకుంటూ.. తాను తెలంగాణ ప్రాంత వాడినని.. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన రాజకీయాలతో తనకేంటి అవసరమని వ్యాఖ్యానించారు. అవసరమైతే తనను అరెస్ట్ చేసుకోవాలని సవాల్ విసిరారు.. అంతకుముందు నాగేశ్వర్ ను అరెస్ట్ చేస్తే హైదరాబాదులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని టిఆర్ఎస్ అధినేత్రి కవిత హెచ్చరించారు. మరోవైపు పవన్ కళ్యాణ్ కూడా నాగేశ్వర్ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన తర్వాత కులాన్ని.. ప్రాంతాన్ని ఆపాదించడం ఎంతవరకు కరెక్ట్ అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లోకి తాను అన్ని వదులుకొని వచ్చానని.. ఎదురు దాడికి దిగితే పరిస్థితి వేరే విధంగా ఉంటుందని హెచ్చరించారు.. పవన్ కళ్యాణ్ హెచ్చరించిన కొద్దిసేపటికి ప్రొఫెసర్ నాగేశ్వర్ స్పందించారు. తనను అరెస్ట్ చేసుకోవచ్చని.. దానికి సిద్ధంగా ఉన్నానని..క్వాష్ పిటిషన్ వేయలా వద్దా.. అనే దానిపై ఇంకా ఆలోచించుకోలేదని నాగేశ్వర్ పేర్కొన్నారు. . ఇప్పటికే నాగేశ్వర్ కు అనుకూలంగా వైసీపీ మీడియా.. బిఆర్ఎస్ మీడియా వ్యవహరిస్తున్నాయి. మధ్యలో కవిత కూడా సపోర్ట్ ఇస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం రెండు ప్రాంతాలకు మధ్యదిగా మారిపోయింది. అయితే ఇది ఎక్కడి దాకా దారితీస్తుందో చూడాల్సి ఉంది.

# బీజేపీకి వైసీపీ ఫ్రెండ్లీ వార్నింగ్?

విజయవాడ : రాజకీయాల్లో ఏ చర్య వెనుకైనా ఒక బలమైన వ్యూహం, ఆశించిన లక్ష్యం ఉంటాయి. ఏపీలో ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై చేపట్టిన నిరసనలు ఈ కోవలోకే వస్తాయి. రాష్ట్రానికి సంబంధించిన స్థానిక సమస్యలపై పెద్దగా గళమెత్తని వైసీపీ, ఒక్కసారిగా పెట్రోల్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునివ్వడం వెనుక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పెట్రోల్ ధరల పెంపు అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం అయినప్పటికీ.. వైసీపీ నేతలు మాత్రం ఎక్కడా ప్రధాని మోదీని గానీ, కేంద్ర బీజేపీ నాయకత్వాన్ని గానీ విమర్శించడం లేదు. కేవలం రాష్ట్ర ప్రభుత్వంపైనే విమర్శల బాణాలు ఎక్కుపెడుతున్నారు. అడ్రస్ కేంద్రానిది అయితే, దాన్ని రాష్ట్రం మీదకు మళ్లించడం వెనుక ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్లాన్ ఉన్నట్లు భావిస్తున్నారు.వైసీపీ ఇస్తున్న ఈ సిగ్నల్స్ వెనుక ప్రధాన ఉద్దేశం.. తాము కేంద్రానికి వ్యతిరేకం కాదని, కానీ అవసరమైతే తమ దారి తాము చూసుకుని బీజేపీకి వ్యతిరేకంగా పోరాడగల సత్తా తమకు ఉందని నిరూపించడమే. ఢిల్లీ స్థాయిలో బీజేపీతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే, రాష్ట్రంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ-జనసేన కూటమిని ఇరుకున పెట్టడం ఈ వ్యూహంలోని ప్రధాన భాగం. మేము కేంద్రాన్ని ఏమీ అనడం లేదు, కానీ మీరు తగ్గించొచ్చు కదా అనే ప్రశ్న ద్వారా ప్రజల్లో అధికార కూటమిపై వ్యతిరేకత పెంచడమే వైసీపీ లక్ష్యం. ఇది బీజేపీకి పంపుతున్న ఒక రకమైన సాఫ్ట్ సిగ్నల్ .రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలు వరుసగా కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం అండ ఉంటేనే తాము సురక్షితంగా ఉంటామని వైసీపీ భావిస్తోంది. అందుకే డైరెక్ట్ గా కేంద్రంతో యుద్ధం పెట్టుకోకుండా.. రాష్ట్రానికి సంబంధించిన సెస్, వాట్ అంశాలను సాకుగా చూపిస్తూ నిరసనలు చేపడుతున్నారు. ఇలా చేయడం వల్ల కేంద్రానికి కోపం రాదు, అదే సమయంలో రాష్ట్రంలో తాము ప్రతిపక్షంగా యాక్టివ్ గా ఉన్నామనే సంకేతం కేడర్ కు వెళ్తుంది.ఒకవేళ మోదీపై నేరుగా విమర్శలు చేస్తే, సంబంధాలు దెబ్బతింటాయి. భవిష్యత్తులో సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఎదురయ్యే సవాళ్లను తట్టుకోవడం కష్టమవుతుందని వైసీపీకి తెలుసు. అందుకే, నిరసనల నినాదాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర పన్నుల వైపు మళ్లించారని అంచున్నారు.

పెట్రోల్ ధరల్లో ఏపీ నంబర్ వన్ అని ప్రచారం చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికే చెడ్డపేరు వచ్చేలా చేస్తున్నారు తప్ప, ధరలు పెంచిన కేంద్రానికి ఏమీ కాకుండా జాగ్రత్త పడుతున్నారు. వైసీపీ చేస్తున్న ఈ పెట్రోల్ నిరసనలు కేవలం ధరల కోసమే అని అనుకుంటే పొరపాటే. ఇది పక్కాగా ఢిల్లీ పెద్దల మనసు గెలుచుకుంటూనే, గల్లీలో ఉన్న ప్రత్యర్థులను దెబ్బకొట్టే డబుల్ యాక్షన్ ప్లాన్. కేంద్రం పట్ల మౌనం పాటిస్తూ, రాష్ట్రంపై గగ్గోలు పెట్టడం వెనుక ఉన్న ఈ రాజకీయ చాణక్యం రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తెస్తుందో వేచి చూడాలి.

# జూన్ 15 నుంచి ఏపీలో సర్

విజయవాడ : రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి భారీ యంత్రాంగాన్ని రంగంలోకి దించుతున్నారు. మొత్తం 46,397 మంది బూత్ స్థాయి అధికారులు జూన్ 15 నుంచి జూలై 14 వరకు నేరుగా ఓటర్ల ఇళ్ల వద్దకే వచ్చి సర్వే నిర్వహిస్తారుఈ ఎన్యుమరేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల తరఫున నియమించిన 68,868 మంది బూత్ స్థాయి ఏజెంట్లు కూడా బీఎల్వోలకు సహాయకరంగా వ్యవహరిస్తారు. నకిలీ ఓట్ల తొలగింపు, మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్త ఓటర్ల చేరికను పారదర్శకంగా చేపట్టడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశం.

ఓటర్ల జాబితా సవరణ – ముఖ్యమైన తేదీలు:

జూన్ 6 నుంచి జూన్ 14 వరకు : ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు, అధికారులకు శిక్షణ అవసరమైన ఫారాల ప్రింటింగ్ ప్రక్రియ జరుగుతుంది.

జూన్ 15 నుండి జూలై 14 వరకు : బీఎల్వోల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే జరుగుతుంది. ఇదే సమయంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా జూలై 14 లోగా పూర్తి చేస్తారు.

జూలై 2 1: సేకరించిన ప్రాథమిక వివరాల ఆధారంగా ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురిస్తారు.

జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు: ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు తెలపడానికి, కొత్తగా ఓటు హక్కు కోసం క్లెయిమ్‌లు దాఖలు చేయడానికి ఓటర్లకు అవకాశం కల్పిస్తారు.

జూలై 21 నుండి సెప్టెంబరు 18 వరకు : వచ్చిన క్లెయిమ్‌లు, నోటీసులు మరియు అభ్యంతరాలన్నింటినీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తారు.

సెప్టెంబరు 22 : అన్ని సవరణలు పూర్తి చేసిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తుది ఓటర్ల జాబితానుఅధికారికంగా విడుదల చేస్తారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులు అందరూ భాగస్వాములు కావాల్సిన ఒక కీలకమైన ప్రక్రియ అని సీఈవో వివేక్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా మరియు లోపాలు లేకుండా జరగాలనేదే ఎన్నికల సంఘం లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో తమ బూత్ స్థాయి ఏజెంట్లను తప్పనిసరిగా నియమించాలని ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వివేక్ యాదవ్ కోరారు.

# వైసీపీ నుంచి జంపింగ్స్...



విజయవాడ : ఏపీలో ఎన్నో పార్టీలు ఉన్నాయి. కానీ ప్రధాన పార్టీలు మాత్రం కొన్నే ఉన్నాయి. అందులో మూడు అధికార కూటమిలో చేరిపోయాయి. టీడీపీ జనసేన బీజేపీ ఒక జట్టు కట్టాయి. ఒక అయిదేళ్ళ పాటు ఏపీని పాలించిన వైసీపీ విపక్షంలో ఉంది. విపక్షంలో చూస్తే కాంగ్రెస్ కమ్యూనిస్టు పార్టీలు కూడా ఉన్నాయి. కానీ ఇవేమీ ఏపీలో బలమైన పరిస్థితులలో లేవు. ఉనికి పోరాటం చేస్తున్నాయి. దాంతో విపక్షంలో బలంగా 40 శాతం ఓటు షేర్ తో ఉన్న ఏకైక పార్టీగా వైసీపీ ఉంది. అదృష్టం కలిసి వస్తే మరోసారి అందలం ఎక్కే పార్టీ కూడా వైసీపీ అవుతుందని అంటున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ నుంచి ఫిరాయింపు నేతలు పదుల సంఖ్యలో పార్టీని వీడిపోయారు. వారంతా కూడా కూటమి వైపు వెళ్ళారు. అలా తెలుగుదేశం బీజేపీ జనసేనలలో చేరిపోయారు. మరి కొంతమంది వైసీపీని వీడి ఏ పార్టీలో చేరకుండా పరిస్థితిని గమనిస్తున్నారు. ఇదంతా కూడా తొలి ఏడాదిలోనే జరిగిపోయింది. ఆ తరువాత చూస్తే వైసీపీ నుంచి పెద్దగా జంపింగులు అయితే లేవు. దానికి కారణం వైసీపీని వీడి వెళ్ళిన వారు కూటమి పార్టీలలో సరైన ప్రాధాన్యత పొందకపోవడం. కండువా కప్పుకున్న రోజు తప్ప నాటి నుంచి నేటి వరకూ ఎక్కడా పెద్దగా కనిపించకపోవడమే. దాంతో మిగిలిన వారు కూడా పునరాలోచనలో పడ్డారు అని అంటున్నారుఇక చూస్తే రెండేళ్ళ కూటమి పాలన ముగిసింది. మరో రెండేళ్ళు గట్టిగా కాలం కదిలితే చాలు చివరి ఏడాది ఎన్నికలు వచ్చేస్తాయి. రెండేళ్ళ తరువాత మెల్లగా యాంటీ ఇంకెంబెన్సీ అన్నది మొదలవుతుంది. దాంతో జనాభిప్రాయం ఏమిటి అన్నది కూడా వెల్లడి అవుతుంది. దానిని గ్రహిస్తూ ముందుకు సాగే వైసీపీ నేతలు ఎవరూ ఇక గడప దాటేది ఉండదని వైసీపీ పెద్దలు అంచనా వేసుకుంటున్నారు. వైసీపీలో ఉన్న వారు కూడా బయటకు వెళ్తే చేసేది ఏదీ లేదని కూడా ఒక నిర్ధారణకు వచ్చారని అంటున్నారు. ఇలా వైసీపీలో ఇపుడు ఉన్న నాయకులు అంతా కచ్చితంగా ఎన్నికల దాకా కొనసాగుతారు అని ధీమాగా వైసీపీ పెద్దలు ఉన్నారు.: ప్రాంతీయ పార్టీలు అన్నీ అధినేత ఫేస్ చూసి మాత్రమే మనుగడ సాగిస్తూ ఉంటాయి. అలా జగన్ ఇమేజ్ ని చూసే వైసీపీలో నేతలు ఉంటున్నారు అని అంటున్నారు వైసీపీ గ్రాఫ్ కూడా నెమ్మదిగా పెరిగే అవకాశాలు ఉన్నాయని నాయకులు భావిస్తున్నారు. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి అధినేత న్యాయం చేస్తారు అన్న ఆలోచనలో చాలా మంది ఉన్నారు. నిజానికి ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ దాకా కొందరు బిగ్ షాట్స్ మాజీ మంత్రులు సీనియర్ నేతలు అంతా పార్టీని వీడాలని ఒకనొక సమయంలో నిర్ణయం తీసుకున్నా ఎందుక వెనకడుగు వేశారు. కొన్నాళ్ళ పాటు వారంతా మౌనంగా ఉన్నా ఇపుడిపుడే మీడియా ముఖం చూస్తున్నారు. ఆ విధంగా అధినేత కళ్ళల్లో పడి తాము యాక్టివ్ గా ఉన్నామని చెప్పుకోవడం ద్వారా వైసీపీలో అవకాశాలను అందుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. ఏపీలో సరైన పోటీ ప్రతిపక్షం లేకపోవడమే వైసీపీకి ఒక విధంగా అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ఇష్టం ఉన్నా లేకపోయినా కూటమి కాకపోతే వైసీపీనే ఎంచుకోవాల్సి వస్తోంది అని అంటున్నారు. దాంతో వైసీపీకి పెద్ద ఇబ్బంది లేకుండా పోతోంది అని అంటున్నారు ఇక వైసీపీలో కొనసాగుతున్నారని నాయకులకు పదవులు ఇచ్చే సీన్ ఉంటుందా అన్నది కూడా ఒక ప్రశ్న. పార్టీకి పనికి వచ్చే వారు ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే ఈసారి టికెట్లు ఇస్తారని అంటున్నారు. జగన్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నపుడు అందరూ పనిచేయడం చూశారు, అధికారంలో అయిదేళ్ళూ అంతా పార్టీలో హడావుడి చేయడమూ చూశారు, ఇపుడు విపక్షంలోకి వచ్చాక పార్టీని వీడి వెళ్ళిన వారు ఉన్నా సైలెంట్ గా గడిపిన వారినీ చూశారని అందువల్ల వైసీపీలో ఎవరు ఏమిటో జగన్ కి బాగా తెలుసు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీ నుంచి భారీ జంపింగులు అయితే జరిగేది ఇక మీదట ఉండబోదు అన్న భరోసా అయితే కనిపిస్తోంది అని అంటున్నారు.

# నిమ్మ ధర ఢమాల్..

ఏలూరు : అన్నదాతలతో ఇటు వ్యవస్థ మాత్రమే కాక ప్రకృతి కూడా ఆడుకుంటోంది. సకాలంలో వర్షాలు కురవవు.. పంట చేతికి వచ్చే ముందు అకాల వర్షాలు కురిసి నీటిపాలవుతుంది. అలానే పండిన పంటకు ఈ రోజు ఉన్న ధర రేపు ఉండదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లోని నిమ్మ రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. గత నెల ఇదే సమయానికి 50 కేజీల నిమ్మ బస్తా ధర రూ. 8,500 ఉండగా, ఈరోజు అది రూ. 3,500కు పడిపోయింది. నెల రోజుల వ్యవధిలోనే ఇంత దారుణంగా ధర పడిపోవడంతో అన్నదాతల బాధ వర్ణనాతీతం.వేసవి కాలంలో నిమ్మకాయలకు రేటు ఎక్కువగా ఉంటుంది. ఒక్కో సందర్భంలో ఒక్కో నిమ్మకాయ రూ. 10 పలుకుతుంది. కానీ, ఇదే రైతు దగ్గరికి వస్తే ఈ ధర అస్సలు కనిపించదు. ఇప్పుడు ఏపీ నిమ్మ రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. నిమ్మ ధరలు హఠాత్తుగా పడిపోవడంతో.. అన్నదాతలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో 50 కేజీల బస్తా రూ. 8,500 ఉండగా.. ప్రస్తుతం అదే బస్తా రూ. 3,500కు ఒక్కసారిగా పడిపోయింది. ఇటీవల వరకు ఆశాజనకంగా ఉన్న ధరలు ఇలా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారుఏపీలోని ఏలూరు నిమ్మకాయ ల మార్కెట్ నుంచి ముంబై, మద్రాసు, కర్ణాటక, బెంగళూరు వంటి ఇతర ప్రాంతాలకు భారీ స్థాయిలో నిమ్మకాయలను ఎగుమతి చేసేవారు. అయితే ప్రస్తుతం దిగుబడి తక్కువగా ఉండటంతో.. ఇప్పుడు ఏలూరు మార్కెట్ యార్డుకు ప్రతి రోజు కేవలం 20-30 లారీలు మాత్రమే వస్తున్నాయి. ఏలూరు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రైతులు నిమ్మతోటలను సాగు చేస్తున్నారు. అయితే



గత కొన్ని రోజులుగా ఇతర రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎగుమతులు లేక నిమ్మ రైతులు తీవ్రంగా నష్టపోయారు. పైగా పోయిన నెల నుంచి వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, అకస్మాత్తు వర్షాల కారణంగా నిమ్మకు మంచి రేటు ఉన్నప్పటికీ దిగుబడి బాగా తగ్గింది. మొన్నటి వరకు కేజీ నిమ్మ ధర రూ. 170 వరకు పలగ్గా.. ఇపుడు రూ. 70కి పడిపోయింది. దీంతో నిమ్మ సాగు చేస్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్ వన్ రకం కేజీ నిమ్మ ధర రూ. 70 పలుకుతోంది. ఉత్తర భారతదేశంలో వర్షాలు కురవడం తో ఆ ప్రభావం నిమ్మ ఎగుమతులపై పడింది. ఆకస్మాత్తుగా నిమ్మ ధర ఇంత పెద్ద మొత్తంలో తగ్గిపోవడంతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ధరలు మరింత తగ్గిపోయే పరిస్థితి ఉందని, పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# బాలినేని కోసం రంగంలోకి పవన్



ఒంగోలు :జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్ర నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా కొత్తవారి చేరికలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని చూస్తున్నారు. అయితే ఈ చేరికల విషయంలో జనసేన నేతలు అనుసరిస్తున్న వైఖరిపై పవన్ ఆగ్రహంగా ఉన్నారు. పార్టీని అభివృద్ధి చేయాలంటే చేరికలను ప్రోత్సహించాల్సిందేనని తేల్చి చెప్పారు. అయితే ఇటీవల కొన్ని జిల్లాల్లో పార్టీ క్రమశిక్షణ కట్టు దాటుతోంది. దీంతో పవన్ కళ్యాణ్ నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నారు ఆ జిల్లాలపై. అందులో భాగంగా ప్రకాశం జిల్లా పార్టీ కార్యవర్గాన్ని రద్దు చేశారు. అక్కడ పార్టీ నేతలు అనుసరిస్తున్న తీరును తప్పు పట్టారు. ఒక నేతపై సస్పెన్షన్ వేటు కూడా వేశారు. పార్టీలో ఉంటే ఉండండి లేకపోతే వెళ్లిపోండి అంటూ తేల్చి చెప్పడం విశేషం. ఇటీవల జరిగిన పరిణామాలతోనే పవన్ సీరియస్ గా స్పందించినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి జనసేనలో చేరారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ఆయన సీనియర్ మోస్ట్ లీడర్ కూడా. కానీ ఆయన రాకను ప్రకాశం జిల్లా నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చివరకు అధినేత పవన్ కళ్యాణ్ చెప్పిన వారి వైఖరి మారడం లేదు. దీంతో అధినేత తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. క్రమంలోనే నిన్న జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రకాశం జిల్లా నేతలను ప్రత్యేకంగా పిలిపించుకున్నారు. అయితే ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ రియాజ్ ఈ సమావేశానికి హాజరు కాలేదు. ఆయన మాజీ మంత్రి బాలినేని రాకను వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల బాలినేనికి జనసేన డీలిమిటేషన్ కమిటీ లో చోటు ఇచ్చారు. అధినేత ఆదేశాల మేరకు రాయలసీమతో పాటు ఒంగోలు, నెల్లూరు జిల్లా నేతలతో సమావేశం అయ్యారు బాలినేని. అక్కడ ఓ నేత బాహాటంగానే విమర్శలు చేశారు బాలినేని పై. దీనిపై తాజాగా స్పందించిన పవన్ సదరు నేతపై వేటు వేశారు. అంతటితో ఆగకుండా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని రద్దు చేశారు. నియోజకవర్గ ఇన్చార్జి లతోపాటు వివిధ విభాగాల ప్రతినిధులను సైతం పదవుల నుంచి తొలగించారు. కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా మాజీ మంత్రి బాలినేనికి కీలక బాధ్యతలు కట్టబెట్టనున్నట్లు సంకేతాలు పంపారు.ఇటీవల బాలినేని విషయంలో వైఖరి మారుతోంది పవన్ కళ్యాణ్ కు. మొన్ననే ఆయన సీఎం చంద్రబాబును సైతం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బాలినేని రాకను టిడిపి ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు. అదే సమయంలో జనసేన క్యాడర్ సైతం వ్యతిరేకిస్తోంది. ఒంగోలు కార్పొరేషన్ నుంచి 26 మంది కార్పొరేటర్ లను జనసేనలో చేర్పించారు బాలినేని. అయినా సరే జిల్లా అధ్యక్షుడిగా ఉన్న రియాజ్ సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. వాస్తవానికి బాలినేని వైసీపీ నుంచి రావడంతో ఆయనపై అనుమానపు చూపులు ఉండేవి. పని జిల్లా జనసేన నేతలు వైఖరి చూస్తుంటే వారి వెనుక వైసిపి ఉన్నట్టు అర్థం అవుతుంది. కేవలం బాలినేని అడ్డుకోవాలని రీతిలో వైసిపి నాయకత్వం స్థానిక జనసేన నేతలతో ఇలా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్ వరకు వెళ్లడంతో ఆయన కమిటీలన్నింటినీ రద్దు చేశారు.

# ఎండలకు మాడిపోతున్న కోళ్లు..

ఏలూరు : ఏపీలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకుతోడు వేడిగాలులతో ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు వచ్చేందుకు భయాందోళనకు గురవుతున్నారు. మరోవైపు ఫౌల్ట్రీ ఫారాల్లో పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఉన్నట్లుండి కుప్పకూలిపోయి చనిపోతుండటంతో పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్ర సంక్షోభం ఏర్పడింది.ఏపీ తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్లోనే అత్యధికమని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే, వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ అయ్యాయి.ఏపీలో భారీగా పెరుగుతున్న ఎండల తీవ్రత, వడగాలులు కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వేసవి వేడి తట్టుకోలేక గత కొన్ని రోజుల్లో లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఆదివారం ఒక్కరోజు రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల కోళ్లు మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షలకుపైగా కోళ్లు మరణించాయి. దీంతో కోడి గుడ్ల ఉత్పత్తి భారీగా పడిపోయింది.రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా గడిచిన వారంరోజుల్లో దాదాపు 18 నుంచి 20 లక్షల కోళ్లు చనిపోయినట్లు పౌల్ట్రీ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. విపరీతమైన వేడి వల్ల బతికున్న కోళ్లు కూడా సరిగా మేత తినడం లేదని పౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు



## ఘనంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు

గజ్వేల్:28 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి పురస్కరించుకొని, ఎన్ టి ఆర్ అభిమానుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఫ్డిసి మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ చిరస్మరణీయులు అని, యువత రాజకీయాల్లోకి రావడానికి ఎన్ టి ఆర్ స్ఫూర్తి అని వారి అడుగుజాడల్లో యువత పయనించాలని పిలుపునిచ్చారు,అనంతరం మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, వెంకటేశ్వర్లు,టీచర్ మల్లికార్జున్ మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయ నాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని, తెలుగు జాతిఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానాయకుడు ఎన్ టి ఆర్ అని కొనియాడారు పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన రెండు రూపాయలకు కిలో బియ్యం జనతా వస్త్రాలు పక్కా గృహాల వంటి పథకాలు ఇప్పటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి అని గుర్తు చేశారు ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు ఆర్ కే శ్రీనివాస్,ఎన్ టి ఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నాం

**: జిల్లా కలెక్టర్ కె. హైమావతి.**

సిద్ధిపేట ప్రజాకలం మే 28.

సిద్ధిపేట జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా కొంత వరిధాన్యం తడిసిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. జిల్లాలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన వరిధాన్యాన్ని కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన సుమారు 2,976 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరిగిందని తెలిపారు. ధాన్యం ఆరబెట్టడం, లిఫ్టింగ్ మరియు రవాణా ప్రక్రియలను వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నదని వివరించారు.




అదేవిధంగా, 28-05-2026 నాటికి జిల్లాలో మొత్తం 58,455 మంది రైతుల నుండి 3,14,868 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడినదని తెలిపారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.457 కోట్ల చెల్లింపులు చేయబడినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా మార్గంలో వైద్య సేవలు అందించాలి

**- ఎంపీ రఘునందన్ రావు**

మల్కాజిగిరి,మే28(ప్రజా కలం ప్రతినిధి)

వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా మార్గంలో వైద్య సేవలు అందించాలని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.మల్కాజిగిరిలోని ఎల్కే హాస్పిటల్లో నూతన ఓ పి డి బ్లాక్,సి ఆర్ ఆర్ టి మెషిన్,డయాలసిస్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు,మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎల్కే హాస్పిటల్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా డయాలసిస్ యూనిట్ మరియు సి ఆర్ ఆర్ టి మెషిన్ అందుబాటులోకి రావడం ద్వారా అత్యవసర వైద్య సేవలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు.

హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ,ఆధునిక సౌకర్యాలతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జలంధర్ రెడ్డి, వైద్యులు, సిబ్బంది,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు



# కామన్ మ్యాన్ పై పెట్రో భారం ఎఫెక్ట్




హైదరాబాద్ : సామాన్యుడి జేబుకు మళ్లీ చిల్లులు పడబోతున్నాయి. ఇంధన ధరల పెంపు కేవలం వాహనదారులకే పరిమితం అనుకుంటే పొరపాటే.. దీని ప్రభావం ప్రతి సామాన్యుడి వంటింటి బడ్జెట్పై తీవ్రంగా పడనుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణంమళ్లీ పడగ విప్పనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే రోజుల్లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 5 శాతం మార్కును తాకే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్ల తగ్గింపు విషయంలో వెనక్కి తగ్గే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇంధన ధరల పెంపుతో దేశవ్యాప్తంగా రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతాయి. దేశంలో సరుకు రవాణా వ్యవస్థ అంతా దాదాపుగా డీజిల్తో నడిచే భారీ ట్రక్కుల పైనే ఆధారపడి ఉంది. డీజిల్ రేటు పెరిగితే.. కూరగాయలు, పాలు, కిరాణా సరుకుల నుంచి ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల వరకు ప్రతి వస్తువు రవాణా భారం అమాంతం పెరుగుతుంది. ఈ అదనపు వ్యయాన్ని కంపెనీలు తమ లాభాల్లోంచి భరించవు, అంతిమంగా వినియోగదారుడి (సామాన్యుడి) పైనే మోపుతాయి. ఈ చైన్ రియాక్షన్ కారణంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని, తద్వారా ద్రవ్యోల్బణం మళ్లీ 5 శాతం వైపు పరుగులు తీస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.ఇదే సమయంలో గృహ, వాహన రుణాలు తీసుకున్న సామాన్యులకు, మధ్యతరగతి వర్గాలకు ఆర్బీఐ చేదువార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తే ఆర్బీఐ రెపో రేటు తగ్గిస్తుందని, తద్వారా తమ ఈఎంఐభారం తగ్గుతుందని ఎంతోకాలంగా ఆశగా ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురుకానుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రాథమిక లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడమే. కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతం వద్ద స్థిరంగా ఉంచాలని ఆర్బీఐ టార్గెట్ పెట్టుకుంది. కానీ ఇప్పుడు ఇంధన ధరల సెగతో అది 5 శాతానికి చేరువవుతుండటంతో, ఆర్బీఐ తన విధాన నిర్ణయాల్లో మరింత ఆచితూచి వ్యవహరించనుంది. త్వరలో జరగబోయే ద్రవ్య పరపతి విధాన కమిటీసమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆర్థికవేత్తలు అంటున్నారు.ఒకవైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు.. దానికి తోడు ఆకాశాన్నంటుతున్న కూరగాయలు, కిరాణా సరుకుల ఖర్చులు.. మరోవైపు ఏమాత్రం తగ్గని బ్యాంక్ ఈఎంఐల భారం. వెరసి ప్రస్తుత ఈ ఆర్థిక పరిణామాలు రాబోయే త్రైమాసికంలో సామాన్యుడిని ఆర్థికంగా మరింత ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

## మహిళా రోగికి చైనా నుంచి రిమోట్ రోబో సర్జరీ

హైదరాబాద్ : చైనాలో ఉన్న వైద్యుడు హైదరాబాద్లోని మహిళ(57) మూత్రనాళానికి తొలిసారి రోబో సహాయంతో శస్త్రచికిత్స చేశారు. దాదాపు 3,900 కి.మీ. (వైమానిక) దూరంలో ఉన్నా... అధునాతన సాంకేతికత సాయంతో చేసిన ఈ రోబోటిక్ సర్జరీ వైద్యరంగంలో కొత్తదారులకు తలుపులు తెరిచింది. సంబంధిత వివరాలను హైదరాబాద్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ(ఏఐఎన్ఐయూ) బంజారాహిల్స్ ఎండీ, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ మల్లికార్జున, సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ సయ్యద్ ఎండీ గౌస్ వెల్లడించారు. హైదరాబాద్కు చెందిన మహిళకు మూత్రనాళం ఇరుకుగా మారడంతో మూత్ర విసర్జనలో తరచూ ఇబ్బంది పడుతున్నారు. గతంలో స్టెంటింగ్ ద్వారా తాత్కాలిక ఉపశమనం కల్పించినా, సమస్య పునరావృతమైంది. పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం... సాధారణ మూత్ర ప్రవాహాన్ని పునరుద్ధరించడానికి యాంటీ రిఫ్లక్స్ యూరెటరిక్ ఇంప్లాంటేషన్ చేయాలని నిర్ణయించింది. రోబోటిక్ టెలిసర్జరీపై జరిగిన ఓ కాన్ఫరెన్స్ కోసం చైనాలోని వూహాన్ నగరానికి వెళ్లిన ఏఐఎనీయూ వైద్యుడు డాక్టర్ సయ్యద్ ఎండీ గౌస్... అక్కడి నుంచే హైదరాబాద్లో ఉన్న తమ రోగికి రోబో సాయంతో సర్జరీ చేసేందుకు సిద్ధమయ్యారు. “5జీతో అనుసంధానమైన రోబోటిక్ సాంకేతికతను ఉపయోగించి 100 మిల్లీ సెకన్ల కంటే తక్కువ లాటెన్సీ (అక్కడి నుంచి ఇక్కడికి సిగ్నల్స్ చేరే సమయం)తో ఈ నెల 18న సర్జరీని రియల్టైంలో పూర్తిచేశాం. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. రోగి సమ్మతితోపాటు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకున్నాం. తర్వాత వూహాన్లోని టోంగ్జీ ఆసుపత్రిలో ఒక వైద్య బృందాన్ని, హైదరాబాద్లోని ఏఐఎనీ? ఆసుపత్రిలో మరో నిపుణుల బృందాన్ని సిద్ధంగా ఉంచాం. ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్షణమే హైదరాబాద్లోని వైద్యులు సర్జరీ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశాం. తొలుత హైదరాబాద్లోని రోగి దగ్గర రోబో చేతులు, హెచ్ఏ 3డీ కెమెరాలు అమర్చాం. వూహాన్ ఆసుపత్రిలో రోబో కన్సోల్ నుంచి రియల్ టైమ్-3డీ ఇమేజ్ను చూస్తూ రోబో చేతులను నియంత్రిస్తూ 90 నిమిషాల్లోనే సర్జరీని విజయవంతంగా పూర్తి చేశాం” అని డాక్టర్ గౌస్ వివరించారు.

# భూవివాదం వెనుక రాజకీయ నేతల హస్తం

హైదరాబాద్ : సినీ గేయరచయిత అనంత్ శ్రీరామ్ సోమవారం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్లో ప్రత్యక్షమయ్యారు. జిల్లా యంత్రాంగం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని, తన కుటుంబానికి ఎదురవుతున్న వేధింపులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక భూవివాదం కారణంగా తన వృద్ధులైన తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, వారికి తక్షణమే రక్షణ కల్పించాలని ఆయన విన్నవించారు.యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమకు ఉన్న 5 సెంట్ల ఉమ్మడి స్థలం విషయంలో వివాదం నెలకొందని అనంత్ శ్రీరామ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. అయితే, ఈ వివాదంలో మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య కుమారుడు, చేగొండి సూర్యప్రకాష్ జోక్యం చేసుకుని తన తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపణలు చేశారు.సదరు స్థల వివాదం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, విచారణ జరుగుతుండగానే రాజకీయ పలుకుబడితో తమపై ఒత్తిడి తెస్తున్నారని అనంత్ శ్రీరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడకుండా, వృద్ధులైన నా తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. చట్టంపై గౌరవంతో తాను అధికారులను ఆశ్రయించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. గ్రామంలో ఉంటున్న తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని, రాజకీయ నాయకుల అనుచరుల నుంచి వారికి ముప్పు పొంచి ఉందని అనంత్ శ్రీరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ , ఎస్పీకి తన ఫిర్యాదు ప్రతిని అందజేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వివాదాస్పద స్థలంలో యథాతథ స్థితిని కాపాడాలని ఆయన కోరారు.అనంత్ శ్రీరామ్ ఫిర్యాదును స్వీకరించిన జిల్లా అధికారులు, ఈ అంశంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని యలమంచిలి తహసీల్దార్, పోలీసు అధికారులను ఆదేశించారు. చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంత్ శ్రీరామ్ , చేగొండి హరిరామ జోగయ్య కుటుంబాల మధ్య భూవివాదం ఉన్నా.. వారు సమీప బంధువులే. అనంత్ శ్రీరామ్ మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్యకు స్వయానా మేనల్లుడు. సొంత సోదరి కుమారుడు . అనంత్ శ్రీరామ్లోని సాహిత్య ప్రతిభను గుర్తించి, ఆయనను సినిమా రంగానికి పరిచయం చేయడంలో చేగొండి హరిరామ జోగయ్య కీలక పాత్ర పోషించారు. తన మేనల్లుడికి పాటల రచయితగా అవకాశాలు రావాలని జోగయ్య స్వయంగా అనేకమంది దర్శకులు, నిర్మాతల దగ్గర సిఫార్సు చేశారు. ఒకప్పుడు ఒకే గొడుగు కింద ఎదిగిన ఈ రెండు కుటుంబాల మధ్య ఇప్పుడు 5 సెంట్ల భూమి కోసం వివాదం చెలరేగడం, అది కలెక్టరేట్ మెట్లెక్కడం పశ్చిమగోదావరి జిల్లా రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**ఆయనే భూ కబ్జాదారుడు...** సినీ పాటల రచయిత అనంత శ్రీరామ్, ఆయన బంధువు చేగొండి సూర్యప్రకాష్ మధ్య మొదలైన ఆస్తి వివాదం ఇప్పుడు రాజకీయ, న్యాయపరమైన మలుపులు తిరుగుతోంది. అనంత శ్రీరామ్ తన కుటుంబానికి రక్షణ కల్పించాలని, తన తల్లిదండ్రులను సూర్యప్రకాష్ బెదిరిస్తున్నారని కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై సూర్యప్రకాష్ ఘాటుగా స్పందించారు. అనంత శ్రీరామ్ చేస్తున్న ఆరోపణలన్నీ పచ్చి అబద్ధాలని, తనపై కావాలనే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.అనంత శ్రీరామ్ తన డబ్బు, పరపతి, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తనను వ్యక్తిగతంగా వేధిస్తున్నారని సూర్యప్రకాష్ ఆరోపించారు. తనపై కక్షపూరితంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఈ క్రమంలోనే ఆయనపై పరువు నష్టం దావా వేయబోతున్నట్లు ప్రకటించారు. తన చరిత్ర నిష్కళంకమని, తనపై ఇప్పటివరకు కనీసం ఒక్క పోలీస్ కేసు కూడా లేదని ఈ సందర్భంగా సూర్యప్రకాష్ గుర్తు చేశారు. అనంత శ్రీరామ్ మాటలకు భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.అసలు వివాదం ఆస్తికి సంబంధించిందని సూర్యప్రకాష్ వివరించారు. తన తాతయ్య చేగొండి కృష్ణమోహన్ రావుకు చెందిన ఆస్తిని అనంత శ్రీరామ్ అక్రమ మార్గాల్లో స్వాధీనం చేసుకున్నారని ఆయన సంచలన ఆరోపణ చేశారు. ఆ ఆస్తిని కాజేసేందుకే తనను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నారని, అందుకే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పాలమూరుకు తగ్గనున్న నీటి కష్టాలు

## - బ్రిడ్జి నిర్మాణానికి రెండు రాష్ట్రాలు అంగీకారం




మహబూబ్నగర్ : తెలంగాణ, కర్ణాటక అంతరాష్ట్ర సరిహద్దుల్లో కృష్ణానదిపై ఒక కొత్త బ్యారేజీతో పాటు వంతెనను నిర్మించేందుకు రెండు రాష్ట్రాల మధ్య కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. ఉన్నత స్థాయి భేటీలో కర్ణాటక ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీసుకురాగా.. తెలంగాణ ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలత వ్యక్తం చేస్తూ పరిశీలిస్తోంది. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణా మండల పరిధిలోని కొల్పూరు గ్రామానికి, కర్ణాటకలోని రాయచూరు జిల్లా కోర్సుండా గ్రామానికి మధ్యలో ఈ బ్యారేజీని నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జూరాల జలాశయానికి ఎగువన, కర్ణాటకలోని గుర్జాపూర్, గూగల్ చిన్న బ్యారేజీలకు దిగువన ఈ కొత్త ప్రాజెక్టు రానుంది.సుమారు రెండు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ బ్యారేజీని నిర్మిస్తే.. తెలంగాణలోని మక్తల్ నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలకు తాగు, సాగునీటి అవసరాలు పూర్తిగా తీరనున్నాయి. నీటి లభ్యతతో పాటు ఈ బ్యారేజీపై వంతెనను కూడా నిర్మించడం వల్ల ప్రస్తుతం రాయచూరు సమీపంలోని శక్తినగర్, కృష్ణా మండలం మధ్య ఉన్న పాత వంతెనపై ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు భీమా నదిపైనా మరో చిన్న బ్యారేజీ, వంతెన నిర్మించాలనే ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. సోమవారం నాటి సమావేశంలో తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి ఈ కొత్త ప్రతిపాదనను కర్ణాటక ప్రతినిధుల ముందుకు తీసుకెళ్లారు. నారాయణపేట జిల్లాలోని తంగడిగి, కర్ణాటకలోని సుగూరు గ్రామాల మధ్య భీమానదిపై 0.25 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించాలని కోరారు. ఈ చిన్న బ్యారేజీ నిర్మాణం వల్ల ఇరు రాష్ట్రాల సరిహద్దు రైతులకు, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. కృష్ణానదిపై ప్రతిపాదించిన ప్రధాన బ్యారేజీని రెండు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించి వ్యయాన్ని సమానంగా పంచుకోవడం ద్వారా ఉమ్మడిగా ప్రయోజనం పొందవచ్చనే కోణంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ అంతరాష్ట్ర ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం దాదాపు రూ.500 కోట్ల వరకు ఉండవచ్చని నీటిపారుదల రంగ నిపుణులు ప్రాథమికంగా లెక్కగట్టారు. కృష్ణానదిపై ప్రతిపాదించిన బ్యారేజీకి సంబంధించి హైడ్రాలజీ, ముంపు ప్రాంతాలు, సాంకేతికాంశాలను క్షుణ్ణంగా ఖరారు చేసేందుకు ఇరు రాష్ట్రాల నీటిపారుదలశాఖల ఇంజినీర్లతో ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని సోమవారం నాటి సమావేశంలో నిర్ణయించారు. ఈ ఉమ్మడి కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది. ఆ నివేదిక అందిన తర్వాత రెండు రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు మరోమారు సమావేశమై తుది నిర్ణయం తీసుకోనున్నారు

# వాట్సాప్ లో గ్రేటర్ సేవలు



హైదరాబాద్ : హైదరాబాద్లో బర్త్ సర్టిఫికెట్ సవరణ కోసమో లేదా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు కోసమో ప్రభుత్వ ఆఫీస్ల చుట్టూ తిరగడం అంటే అగ్నిపరీక్షే. కానీ, మారుతున్న కాలంతోపాటు పాలన కూడా ప్రజల అరచేతిలోకి వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, కమ్యూనికేషన్ల విభాగం ఆధ్వర్యంలోని మీ సేవ ప్లాట్ఫామ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల కోసం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. తెలంగాణ మీ సేవ ప్లాట్ఫామ్ తన వాట్సాప్ చాట్బాట్ సేవలను మరింత విస్తరించింది. గతంలో ఉన్న సేవల కంటే అదనంగా, ఇప్పుడు తొమ్మిది కొత్త జీహెచ్ఎంసీ సేవలను ఈ డిజిటల్ ప్లాట్ఫామ్లో చేర్చారు. దీని వల్ల హైదరాబాద్ నివాసితులు తమ ఇంటి నుంచే కేవలం ఒక వాట్సాప్ మెసేజ్తో తమ పనులను పూర్తి చేసుకోవచ్చు. కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండానే, నేరుగా చాట్ ఇంటర్ఫేస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ఆస్తి పన్ను సేవలు, పన్ను చెల్లింపులు, విచారణలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపారస్తులు సులభంగా తమ లైసెన్స్లను అప్డేట్? చేసుకోవచ్చు. పేర్లు లేదా ఇతర వివరాలు జనన ధృవీకరణ పత్రాల్లో సవరణలు ఉంటే సరిదిద్దుకోవచ్చు. ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ చేసుకోవచ్చు. పేరు మార్పు, సవరణ, ఇంటి వద్ద జరిగిన జననాల నమోదు, ఇంటి వద్ద జరిగిన మరణాల నమోదు, ఇతర పౌర సేవలు ఇందులో పొందవచ్చు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పౌర సేవలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టింది. ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్, వాట్సాప్ అందుబాటులో ఉన్నాయి. ఇతర యాప్లు డౌన్లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా పని పూర్తి అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే శ్రమ, రవాణా ఖర్చులు తప్పుతాయి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచే సేవలు పొందవచ్చు. గత ఏడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ వాట్సాప్ ఛానెల్కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆదాయ ధృవీకరణ పత్రాలు, పోలీసు చాలనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రజలు దీనిని విరివిగా వాడుతున్నారు. మీసేవ వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవడం చాలా సులభం. స్టెప్స్ ఉన్నాయి ముందుగా మీరు 8096958096 నెంబర్ను సేవ్ చేసి పెట్టుకోవాలి.

## తల్లి, కొడుకు ఆత్మహత్య

రంగారెడ్డి : అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని కనకదుర్గ కాలనీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.తండ్రి మరణాన్ని తట్టుకోలేక కొడుకు ఉరేసుకుని ఆత్మహత్యకి పాల్పడగా కొడుకు శవాన్ని చూసి తట్టుకోలేక తల్లి అక్కడే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న హృదయ విదారక ఘటన అందరిని కలిచివేసింది.కనకదుర్గ కాలనీకి చెందిన కళావతి , ఆమె కుమారుడు శివ నివాసముంటున్నారు.గత ఆరు నెలల క్రితం కళావతి భర్త హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబం తీవ్రగ్భ్రాంతికి లోనైంది. కుటుంబ పెద్దను కోల్పోయిన నాటి నుండి తల్లి, కొడుకు ఇద్దరూ తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారు.ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన కుమారుడు శివ, ఇంట్లోని ఫ్యాన్కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కండ్ల ముందే కొడుకు శవమై వేలాడటం చూసి తట్టుకోలేకపోయిన తల్లి కళావతి, తీవ్ర మనస్తాపంతో అదే చీరతో పక్కనే ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది.ఒకే ఇంట్లో తల్లి, కొడుకు ఇద్దరూ శవాలుగా మారిన విషయం తెలుసుకున్న కాలనీవాసులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్మెట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.ఆరు నెలల వ్యవధిలోనే ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో కనకదుర్గ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## గుమ్మడిదల లో రైతుల రాస్తారోకో

పటాన్ చెరు : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో ధర్నాకి దిగినా రైతులు,పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలంటూ గుమ్మడిదల జాతీయ రహదారిపై బైటయించి రైతులు ధర్నా చేస్తున్నారు,,సరైన సమయంలో దాన్యం కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి దాన్యం తడిసిపోయిని భారీ నష్టం వాటిల్లండంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూన్నారు,,ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పదించి ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు, మున్సిపల్ చేర్మెన్ తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు కూడా ధర్నాలో పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశాలకు విద్యార్థినిలకు ఆహ్వానం..!

ప్రజా కలం ప్రతినిధి మే 28 మెదక్ రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుకునే విద్యార్థినిలకు ప్రవేశాలకు దరఖాస్తులు



ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి స్వయం ప్రభ తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఫస్టియర్ బైపీసీ. ఎంపీసీ. విభాగాల్లో 40 సీట్లు, సెకండియర్ ఎంపీసీ లో 28, బైపిసి లో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. అనుభవం గల ఉపాధ్యాయురాల బృందంతో ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్య అందించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కస్తూర్బా గాంధీ పాఠశాల జూనియర్ కాలేజ్ ని సంప్రదించాలని సూచించారు. చివరి తేదీ జూన్ 05 వరకు ఉందని చెప్పారు. జిల్లాలోని విద్యార్థినిలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని స్పెషల్ ఆఫీసర్ స్వయంప్రభ సూచించారు.

## గజ్వేల్ అంబేద్కర్ సంఘం షాపింగ్ కాంప్లెక్స్ నూతన కమిటీకి ఘన సన్మానం

గజ్వేల్:28 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లోని స్థానిక అంబేద్కర్ విగ్రహ సర్కిల్ వద్ద నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ షాపింగ్ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షుడు మస్కూరి కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లారం ఎల్లయ్యతో పాటు కార్యవర్గ సభ్యులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్



వంటేరు ప్రతాప్‌రెడ్డి,గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యం వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతన కమిటీ గజ్వేల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు.ప్రతి గ్రామంలో అంబేద్కర్ సంఘాలను ఏర్పాటు చేసి,దళిత బహుజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేకంగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంగిశెట్టి రవీందర్,కళ్యాణ్కర్ నరసింగరావు,కప్ప పోచయ్య,కనకయ్య మల్లేశం, కౌన్సిలర్ మరియు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాల రమేష్ గౌడ్,సోషల్ మీడియా అధ్యక్షుడు బైరం శివకుమార్,దళిత సంఘాల నాయకులు తుమ్మ శ్రీనివాస్,పొన్నాల కుమార్,చిప్పల యాదగిరి, మైసరాములు,నీరుడి స్వామి,గాలింక శ్రీనివాస్, నాన్నం గిరి తదితరులు పాల్గొన్నారు.అలాగే అంబేద్కర్ షాపింగ్ కాంప్లెక్స్ గౌరవ అధ్యక్షుడు అటకూరి రాములు, కార్యవర్గ సభ్యులు సల్ల నాగయ్య, పంబాల ఎల్లయ్య, దమ్మని మల్లయ్య, ఎన్. నాగయ్య,మైన స్వామి,పొట్ట యాదగిరి,పంబాల సత్యనారాయణ,మాచవరం బాల నరసయ్య, చింతకింది బాలయ్య,మైసని మల్లయ్య తదితరులు హాజరయ్యారు.

## అయ్యప్ప స్వామి ఆలయ ఉపాధ్యక్షులుగా జగ్గయ్యగారి శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నిక

గజ్వేల్:28 మే 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఉ



పాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ,అయ్యప్ప స్వామి ఆలయం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని కోరుకుంటూ,ప్రతి ఒక్కరూ దైవభక్తి సేవా గుణం కలిగి ఉండాలని దైవ నామస్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని అన్నారు

## వీరారెడ్డిపల్లిలో పోచమ్మ బోనాల సంబరాలు.

సిద్దిపేట ప్రజాకలం మే 28.

సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో గ్రామదేవత పోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించిన బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తులు పూనకంతో భక్తులను ఆకట్టుకోగా, దప్పు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, సంప్రదాయ కళారూపాలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ వీధులన్నీ భక్తి గీతాలతో మార్మోగిపోగా, యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు.పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో గ్రామానికి సుఖశాంతులు, పంటలు సమృద్ధిగా కలగాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. బోనాల ఊరేగింపుతో వీరారెడ్డిపల్లి గ్రామం మొత్తం పండుగ శోభను సంతరించుకుంది.



# పేటలో కన్నీటి కష్టాలు..

# అందని 'భగీరథ' నీళ్లు



- -మినీ ట్యాంకులే దిక్కు
- -పట్టించుకోని అధికారులు
- -వెంటనే మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్
- -లేనియెడల ఖాళీ బిందెలతో నిరసన
- -మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బషీర్ ఖురైషి

పటాన్ చేరు మే 28 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు. మంచినీటి కష్టాలతో కృష్ణారెడ్డి పెట్ వార్డ్ కార్యాలయ ప్రజలు కన్నీరు కారుస్తున్నారు.మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో దాహార్తితో తమ వార్డు కార్యాలయ ప్రజలు అలమటిస్తున్నారాని బషీర్ ఖురేషి ఆగ్రహం వ్యక్తం చేశారు.నీటిని సరఫరా చేయించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా బషీర్ ఖురేషి మాట్లాడుతూ తమ వార్డు కార్యాలయం పరిధిలో మంచి నీరు సరఫరా అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అధికారులకు ఎన్నిసార్లు తమ గూడు విన్నవించిన పట్టించుకునే నాధుడే కరువయ్యారని, తమ వార్డు లో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తోచడం లేదని అన్నారు. వార్డ్ కార్యాలయం పరిధిలో నీటి సమస్యలు తీరకపోతే ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తామని అన్నారు. సందేహాలుంటే 155313 కాల్ చేయండి ఉచిత నీటి పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ మద్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వం జవాబుదారితనం కోల్పోయిందని మండిపడ్డారు. టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసిన స్పందించకపోవడం అధికారులు మొద్దు నిద్రలో ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తుందని అన్నారు.



బక్రీద్ పండుగకు మంచి నీటి సరఫరా చేయని అధికారులు

వారం రోజులుగా కృష్ణారెడ్డి పెట్ వార్డ్ కార్యాలయం పరిధిలో నల్ల నీళ్లు లేక కనీస సౌకర్యాలు, ఇంటి పని చేసుకోవడానికి చాలా కష్టం అవుతుందని ఎక్కడో ఊరి బయటకు వెళ్లి అందరూ అక్కడికే వెళ్లి నీళ్లు పట్టుకోవడం సమయం వెచ్చించి నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వేరే చోట వెళ్లి నీళ్లు తెచ్చుకునే వరకు చాలా సమయం పడుతుందని దీనివల్ల విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి సమయం సరిపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.తమకు తక్షణమే నీటి సమస్య పరిష్కరించాలని లేనియెడల ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

అధికారుల పర్యవేక్షణ లోపం

వేసవికాలం మంచినీటి ఎద్దడి ఉంటే మరింతగా నీటి కోసం ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంటుందని వార్డ్ కార్యాలయ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇటువంటి సమస్య ఉత్పన్నమవుతోందని బషీర్ ఖురైషి మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత అధికారుల చేత తమ వార్డు కార్యాలయం పరిధిలో త్రాగునీరు కొరతను గుర్తించి తక్షణమే తాగు నీటి సదుపాయం కల్పించాలని వార్డ్ కార్యాలయ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# టీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి బోడ జనార్ధన్

## ప్రశ్నిస్తాం, పోరాడుతాం, సాధించుకుంటాం-కవిత

## సింగరేణి,ఆర్టీసీ కార్మికులను రేవంత్ ప్రభుత్వం మోసం చేస్తోందని ధ్వజం

## సబ్బండ వర్గాల జీవన ప్రమాణాలు మార్చేల టీఆర్ఎస్ ప్రణాళికలు



హైదరాబాద్:మే 28: ప్రజాకలం ప్రతినిధి

సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చేందుకు విప్లవాత్మక మైన అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.తెలంగాణ ప్రజలు మార్పుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కవిత కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న బోడ జనార్ధన్ చేరికతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. గతంలో కార్మిక శాఖ మంత్రిగా,ఆర్టీసీ చైర్మన్‌గా పనిచేసిన ఆయనకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులను దగా చేస్తూ కర్కషంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**ప్రశ్నించి,పోరాడి,పరిష్కరించడమే మా విధానం-టీఆర్ ఎస్**

తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించేందుకే తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని కవిత స్పష్టం చేశారు. ప్రశ్నించటం ,పోరాడటం, పరిష్కరించటం అనే సిద్ధాంతంతో తమ పార్టీ ముందుకు వెళ్తుందన్నారు.తాము చేపట్టిన జనం బాట కార్యక్రమం ద్వారా ఇప్పటికే 25 సమస్యలకు పరిష్కారం లభించిందని గుర్తుచేశారు.పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు,నల్గొండలో 35 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి పనులు తాము ప్రశ్నించడం వల్లే ప్రభుత్వం దిగివచ్చి పనులు ప్రారంభించిందని పేర్కొన్నారు.

**కార్మికులకు తీవ్ర అన్యాయం**

సింగరేణి,ఆర్టీసీ సహా అన్ని రంగాల కార్మికులను రేవంత్ సర్కార్ ఘోరంగా మోసం చేస్తోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.ఆరేళ్ల క్రితం మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్నప్పుడు కార్మికులకు కనీస వేతనం రూ. 20 వేలు ఉండాలని లేఖ రాసిన రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి అయ్యాక మాత్రం రూ. 16 వేలకే పరిమితం చేసి నయవంచనకు గురిచేశారని విమర్శించారు. తెలంగాణ వచ్చాక సాధించుకున్న డిపెండెంట్ ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఊడబీకే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఐఎన్‌టీయూసీతో కలిసి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని, బోడ జనార్ధన్ సహకారంతో హెచ్ఎంఎస్ అనుబంధంతో సింగరేణి కార్మికుల కోసం గట్టిగా పోరాడుతామన్నారు.

**ఆర్టీసీ విలీనం ఊసే లేదు**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, డ్రైవర్ రాజు గౌడ్ బలిదానం చేసుకునే వరకు విలీనం ఊసెత్తలేదని కవిత విమర్శించారు. ప్రభుత్వంపై ప్రశ్నిస్తే తట్టుకోలేక కార్మికుల ఉద్యోగాలు తీసేసే కర్కష పాలన సాగుతోందని ధ్వజమెత్తారు.

**ఎన్టీఆర్, కేసీఆర్ కన్నా ఉన్నతంగా ఆలోచించారు: బోడ జనార్ధన్**

మాజీ మంత్రి బోడ జనార్ధన్ మాట్లాడుతూ.. ఒక మహిళా నాయకురాలు పార్టీ పెట్టి ప్రజాసమస్యలపై పోరాడటం సాహసోపేతమైన నిర్ణయమన్నారు.గతంలో ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ, కేసీఆర్ నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాలతో వస్తే.. కవిత మాత్రం పాంచజన్యం పేరిట ఐదు కీలక అంశాలతో వారి కంటే ఉన్నతంగా ఆలోచించారని కొనియాడారు. ఆమె ప్రకటించిన మేనిఫెస్టో నచ్చే తాను టీఆర్ఎస్‌లో చేరుతున్నానని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తాన్నారు. ఇటు పార్టీని బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు.





## విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, డా.పద్మభూషణ్ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, డా.పద్మభూషణ్ నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని ప్రగతినగర్ సమీపంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళి ఆధ్వర్యంలో సుమారు 3,000 మంది సభ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు జయంతి వేడుకలు అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు.



ఈకార్యక్రమానికి అతిథులుగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టి.పి.సి.సి. మాజీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డిలు హాజరై, నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం వారు మాట్లాడుతూ.... నందమూరి తారక రామారావు తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచ స్థాయిలో చాటిన మహానటుడని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావుడని కొనియాడారు. ఆయన ప్రజాసేవా జీవితం నేటి తరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, బొమ్ము తాతి రెడ్డి, చిట్ల దివాకర్, కడియాల ఇందిరా, కొలన్ జీవన్ రెడ్డి, మైసి శ్రీనివాస్, శ్రీదేవి, యశోద, గిరిజాకుమారి, వేదగిరి పవన్, రవీంద్రనాథ్ టాగూర్, కాజా కళ్యాణ చక్రవర్తి, యడ్లపల్లి నాగేశ్వర రావు, కంకణాల శివాజీ, మౌళేశ్వర్ రావు, పల్లూరి సత్య ప్రసాద్, సురేందర్, పార్వతిని అంజనీయ వర్మ, మెడ శ్రీనివాసరావు, తలశిల కిరణ్, వెనిగళ్ళ వినయకుమార్, వి. హనుమంతరావు, బొల్లి ప్రకాష్, బండ్లమూడి సత్యనారాయణ, ఉప్పలపాటి సుబ్రహ్మణ్యం, హనుమంతరావు, వసంతం విజయ్, ముక్కపాటి మురళీకృష్ణ, ఉప్పలపాటి ప్రశాంత్, పాటిబండ్ల హరీష్, మండలపు రమేష్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ గురువారం ఐడిపిఎల్ చౌరస్తా వద్ద ఉన్న నందమూరి తారక రామారావు (NTR) విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించి వారిని స్మరించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఖ్యాతిని విశ్వ వ్యాప్తంగా తీసుకెళ్లిన గొప్ప మహనీయుడని, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి వినలేని కృషి



చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా సినీ రంగంలో గొప్ప నటనతో ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జై రామ్, రంగారావు, కూన రాఘవేందర్ గౌడ్, మోటే శ్రీనివాస్ యాదవ్, గడ్డం రాజేందర్ రెడ్డి, రవి, దిలీప్, శంకరయ్య, రవీందర్ గుప్తా, మల్లం శీను, శంకర్ గౌడ్, తోకల శీను, శ్రీకాంత్, చోటు ఓంకార్, శివ, సురేందర్, క్రాంతి, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# త్యాగానికి ప్రతీకగా బక్రీద్

## - వేములవాడలో భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్-అధా వేడుకలు

## -ఈద్గాలో సామూహిక నమాజ్‌లు...మత సామరస్యం వెల్లివిరిసిన వేడుకలు.

వేములవాడ, మే 28 (ప్రజా కలం ప్రతినిధి) : పవిత్రమైన ఈద్ ఉల్-అధా (బక్రీద్) పర్వదినాన్ని పురస్కరించుకొని గురువా వేములవాడ పట్టణంలో ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచే నూతన వస్త్రాలు ధరించిన చిన్నా, పెద్దా ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భారీ సంఖ్యలో ముస్లింలు పాల్గొని సామూహిక నమాజ్‌లు ఆచరించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ప్రార్థనలు భక్తి, త్యాగం, సహనానికి ప్రతీకగా నిలిచాయి. అనంతరం ఈద్గాలో మౌలానాలు ప్రసంగిస్తూ దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం చేసిన మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటామని తెలిపారు. త్యాగ నిరతి, సేవాభావం, సహోదరత్వానికి బక్రీద్ ప్రతీక అని పేర్కొన్నారు. ధనిక--పేద తారతమ్యం లేకుండా ప్రతి ముస్లిం కుటుంబం ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం విశేషమన్నారు. బక్రీద్ విశిష్టతలో భాగంగా నిర్వహించిన ఖుర్బానీ అనంతరం మాంసాన్ని పేదలు, బంధువులు, అవసరమైన వారికి పంచిపెట్టారు. దీంతో మానవత్వం, దాతృత్వం ప్రతిఫలించాయి. బక్రీద్ పండుగకు ముందు ఈద్గాను సందర్శించి అవసరమైన సదుపాయాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మున్సిపల్ సిబ్బందికి ముస్లిం పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఈద్గా వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో మత పెద్దలు, ముస్లిం నాయకులు ప్రజా ప్రతినిధులు,పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు, దీంతో వేములవాడలో మత సామరస్యం వెల్లివిరిసింది.





## కుత్బుల్లాపూర్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో పలు ప్రాంతాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా సూరారం డివిజన్ వేమారెడ్డి నగర్ లో ఏకే మొబైల్స్ అధినేత మహమ్మద్ అకీబ్ నీ మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నెరాజు కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పండగలు సత్సంబంధాలను పెంపొందిస్తాయని గుర్తు చేశారు. ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాదిరెడ్డి, భాస్కర్ రెడ్డి, కుమ్మరి చందు, శివగుప్తా, మస్తానా బిల్డర్స్ ప్రెసిడెంట్ విక్కీరెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## త్యాగానికి ప్రతీక బక్రీద్ వేడుక... మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ వేడుక త్యాగానికి ప్రతిరూపమని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. గురువారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ లోని ఈద్గాలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన(నమాజ్)లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ముస్లిం సోదరులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ... డివిజన్ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ రోజు ముస్లింలు పేదలకు దానం చేయడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ సర్వ మతాలకు నిలయమన్నారు. కుల మతాలకు అతీతంగా వేడుకలు నిర్వహించుకుని మతసామరస్యాన్ని చాటాలని కోరారు. ఈకార్యక్రమంలో సయ్యద్ రషీద్, మహమూద్, హాజీ, అన్వర్, యాసీన్, జాంగిర్, చాంద్ పాషా, సత్తిరెడ్డి, జనగామ శ్రీధర్, సాయిల్ యాదవ్. తదితరులు పాల్గొన్నారు.

## ముస్లీంలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన బషీర్ ఖురేషి

పటాన్ చేరు మే 28 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్ చేరు కృష్ణారెడ్డి పేట్ వార్డు కార్యాలయం పరిధిలోని ముస్లిం సోదరులకు బషీర్ ఖురైషి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, ప్రేమ, భక్తికి ప్రతీక బక్రీద్ అని,అల్లా ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు. భక్తి శ్రద్దలతో జరిపే అందరి ప్రార్థనలు ఫలించాలని తెలిపారు. తెలంగాణాలో కుల, మతాల ఐక్యతను పెంచిన ఘనత కేసీఆర్ దేనని,ఆయన హయాంలోనే పండుగలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. గంగా,జమున తహజీబ్‌లా తెలంగాణాలో అన్ని మతాలు కలిసిమెలిసి జీవిస్తున్నామని అన్నారు. గత పదమూడేండ్లుగా పండుగలన్నీ ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటున్నామని,ఇదే సంస్కృతిని ముందు తరాలకు అందేలా కొనసాగించుకుం దామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ శాంతి సమరస్య వాతావరణంలో పండుగను ఆనందంగా జరుపుకోవాలని, ప్రతి కుటుంబంలో ముస్లిం సోదరులు ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం నిండాలని కృష్ణారెడ్డిపేట వార్డు కార్యాలయం ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని అల్లాహ్ ను ప్రార్థిస్తున్నట్లు బషీర్ ఖురేషి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు బడి మస్జిద్ సదర్ మొహమ్మద్ అలీ, మాజీ ఉపసర్పంచ్ మొహమ్మద్ ఫహీం,ఖమర్ ఖురేషి, మోయిన్, సలీం, అంజద్ అలీ, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





## గజంగి సత్యనారాయణ ఎఫ్.సి.ఐ సభ్యులుగా నియామకం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మే 28:

భారతీయ ఆహార సంస్థ (ఎఫ్ సి.ఐ) అనేది వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ క్రింద ఉన్న భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇది 1965లో స్థాపించబడింది. ఐతే



దేశంలోని ఆహార ధాన్యాల కొనుగోలు రైతుల నుంచి కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)కు గోధుమలు, బియ్యం, ఇతర ధాన్యాలను ఎఫ్.సి.ఐ కొంటుంది. దీనివల్ల దేశ రైతులకు నష్టాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇది దేశ ఆహార భద్రతా వ్యవస్థకు వెన్నెముక లాంటిది. ఐతే ఈ మహత్తర సంస్థకు మహారాష్ట్ర ప్రాంత సలహా కమిటీ సభ్యులుగా మన తెలుగు వ్యక్తి గజంగి సత్యనారాయణ మల్లయ్య గారిని నియమించారు. వీరు ముందే ముంబైలో సామాజిక నాయకులుగా తెలుగు లోకానికి తెల్సిందే. ఇటీవల బోరివలిలో ఎఫ్.సి.ఐ ప్రాంతీయ కార్యాలయంలో మహారాష్ట్ర కొరకు ఎఫ్.సి.ఐ సలహా కమిటీకి ప్రభుత్వేతర సభ్యుడిగా సత్యనారాయణను నియమించి షాల్వా కప్పి ఘనంగా సన్మానించారు. వారు 1మే 2027 వరకు ఆ పదవిలో కొనసాగుతారని సంబంధిత అధికారులు తెల్పారు. వీరు జిల్లా జగిత్యాలలోని మెట్పలి మండలం వేంపేట గ్రామ వాస్తవ్యులు. ముంబై మహానగరంలో ఒకప్పుడు వర్లీలో పుట్టి పెరిగి, ప్రస్తుతం భీవండి థానే ప్రాంతంలో నివాసమై ఉన్నారు. ఈశుభ వేళ ఆయనకు సమస్త తెలుగు సమాజం అభివందనల వర్షం కురిపిస్తోంది.

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

### - ఈద్గాలు, మసీదుల్లో ప్రార్ధనలు చేసిన మైనారిటీలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 28 ప్రజా కలం : కామారెడ్డి పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా గురువారం ముస్లింలు బక్రీద్ పండుగ వేడుకలను



ఘనంగా జరుపుకున్నారు. త్యాగం, విశ్వాసం, దానానికి ప్రతిరూపమైన బక్రీద్ పండుగను మైనారిటీలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పవిత్ర మక్కా యాత్ర కూడా ఈ నెలలోనే ప్రారంభం కావడంతో బక్రీద్ పండుగకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. స్థానిక మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, కమిషనర్ ల ఆధ్వర్యంలో ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతన వస్త్రాలు ధరించిన మైనారిటీ సోదరులు ఈద్గాల, మసీదుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మైనారిటీలకు ఆయా పార్టీల నాయకులు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఖరీఫ్ కు సన్నద్ధమవుతున్న రైతన్న







కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 28 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతన్నలు రానున్న ఖరీఫ్ వ్యవసాయ పనులకు సన్నద్ధమవుతున్నారు. ఇంకా చాలా చోట్ల వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాకుండానే రైతన్నలు ఖరీఫ్ పనులలో నిమగ్నం అవుతున్నారు. వరి కోయ్యలను కాల్చడం, దుక్కులు దున్నడం, ఎరువులు చల్లడం వంటి పనుల్లో రైతన్నలు తల మునకలవుతున్నారు. అంతేకాకుండా ఎరువులు, విత్తనాలను తీసుకెళ్లేందుకు ఆయా దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఎల్లారెడ్డి మండలంలోని ఓ గ్రామ శివారులో వ్యవసాయ పనుల్లో భాగంగా భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ల ఫోటోను ప్రజలం ప్రతినిధి క్లిక్ మనిపించారు.

## కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న వరి ధాన్యం కొనుగోళ్ల సమస్యలపై ప్రజా కలం దినపత్రిక ప్రత్యేక కథనం





# రైతన్న పాలిట శాపంగా 'అన్ లోడింగ్, లారీల కొరత' సమస్యలు

- పండించిన పంటను అమ్ముకోవడానికి నానా తంటాలు పడుతున్న అన్నదాతలు
- అకాల వర్షాల వల్ల తడుస్తున్న వరి ధాన్యం కుప్పలు, సంచులు...
- ఆరు నెలల పాటు కష్టించి పండించిన దాన్యం కళ్ళముందే నీటి పాలవుతుంటే తల్లడిల్లి పోతున్న రైతన్న
- రోజుల తరబడి రైస్ మిల్లులలో ఖాళీ కాని లారీలు
- అటు అకాల వర్షం, ఇటు రైస్ మిల్లర్ల అన్లోడింగ్ వల్ల రైతన్న ఆగమాగం
- ఆగ్రహంతో పలు చోట్ల ధర్నాలు, రాస్తారోకోలు వరి ధాన్యం తగలబెడుతున్న వైనం





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 28 ప్రజా కలం :**

తెలంగాణలో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలులు, మరియు వడగళ్ల వానల వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతూ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో వరుణుడు కన్నెర్ర చేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.అకాల వర్షాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు మరియు ప్రస్తుత పరిస్థితులు క్రింది విధంగా ఉన్నాయి. కోత కోసి కొనుగోలు కేంద్రాలు (ఐకేపీ సెంటర్లు), కల్లాలు, మరియు రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం ఆకస్మిక వర్షాలకు తడిసి కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షపు నీటి ఉధృతికి రైతులు తెచ్చిన ధాన్యం కుప్పలు కొట్టుకుపోతున్నాయి. ఈదురుగాలుల ధాటికి చేతికొచ్చిన మామిడి కాయలు నేల రాలిపోతున్నాయి, తోటల రైతులు భారీగా నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ సేకరణ వేగంగా జరగకపోవడం వల్ల, రైతులు వారాల తరబడి కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ లోపే వర్షం పడటంతో నష్టం రెట్టింపవుతోంది. వర్షానికి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా, మద్దతు ధరకే ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాలు (కాంటాలు) వేగంగా పూర్తి చేసి, మిల్లులకు తరలించాలని, అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల నష్టపోయిన పంటలను అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి, బాధిత రైతులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

**లారీలు త్వరగా అన్లోడ్ కాకపోవడానికి గల కారణాలు....**

కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ప్రభుత్వ ధాన్యం లారీలను రైస్ మిల్లర్లు త్వరగా అన్‌లోడ్ చేయకపోవడానికి మిల్లర్ల సొంత లాభాపేక్ష, మౌలిక వసతుల లోపాలు, సాంకేతిక కారణాలు ప్రధానంగా ఉన్నాయి. దీనివల్ల లారీలు మిల్లుల వద్దే రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. రైస్ మిల్లర్లు ప్రైవేట్ ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వడం. మిల్లర్లు ప్రభుత్వం పంపే ధాన్యం కంటే, ఓపెన్ మార్కెట్‌లో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులు లేదా దళారుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. ప్రైవేట్ లారీలను వెంట వెంటనే అన్‌లోడ్ చేస్తూ, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీలను మిల్లుల బయట గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల తరబడి వేచి ఉంచుతారు. మిల్లులలో ధాన్యం బస్తాలను దించడానికి, గోదాముల్లో అమర్చడానికి సరిపడా హమాలీలు అందుబాటులో ఉండటం లేదు. దీనికి తోడు మధ్యాహ్నం వేళల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల కూలీలు పని చేయడానికి ముందుకు రాకపోవడంతో అన్‌లోడింగ్ ప్రక్రియ బాగా మందగిస్తుంది. తేమ శాతం, తరుగు (కటింగ్) వివాదాలు రైతులతో పట్టింపులు కూడా లారీలు అన్లోడ్ కాకపోవడానికి ఓ ప్రధాన కారణం. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోవడంతో తేమ శాతం ఎక్కువగా ఉంటోంది. తడిసిన ధాన్యాన్ని దించుకోవడానికి మిల్లర్లు



నిరాకరిస్తారు, లేదా క్వింటాకు 3 నుండి 5 కిలోల వరకు తరుగు (కటింగ్) ఇస్తేనే దించుకుంటామని పట్టుబడతారు. ఈ వివాదాల వల్ల లారీలు అలాగే ఉండిపోతాయి. మరోవైపు రైస్ మిల్లులలో ధాన్యం నిల్వ సామర్థ్యం లేకపోవడం కూడా ఓ కారణమే. గత సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ బియ్యం ఇంకా ఎఫ్‌సీఐ గోదాములకు పూర్తిగా సరఫరా కాకపోవడంతో, చాలా మిల్లులలో కొత్త ధాన్యాన్ని నిల్వ చేయడానికి స్థలం సరిపోవడం లేదు. నూకల శాతం పెరుగుతుందనే భయం. యాసంగి (రబీ) సీజన్ ఎండల తీవ్రత వల్ల, వర్షానికి తడిసి ఎండిన ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే బియ్యం విరిగిపోయి నూకలు ఎక్కువగా వస్తాయి. ప్రభుత్వం ఆశించిన పరిమాణంలో నాణ్యమైన ముడి బియ్యాన్ని అప్పగించాల్సి రావడం వల్ల, నూకల నష్టాన్ని భరించలేక మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి వెనకాడుతున్నారు.

వరి ధాన్యం కొనుగోలులో జాప్యం వల్ల రైతన్నలు ఆగ్రహంతో పలుచోట్ల ధర్నాలు, రాస్తారోకోలు చేయడంతో పాటు వరి ధాన్యం రోడ్డుపై పోసి నిప్పంటించిన ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకొని త్వరితగతిన లారీల కొరత నివారించి వరి ధాన్యం కొనుగోలు పూర్తయ్యేలా చూడాలని రైతన్నలు కోరుతున్నారు.





# జెండా లేదు..

# జనమే బలం!

## శేరిలింగంపల్లిలో కొత్త రాజకీయం..!

### పార్టీ జెండా లేకుండానే ప్రజల గుండెల్లో చోటు సంపాదిస్తున్న బోనాల మహేష్ లడ్డా

- సేవే అజెండాగా శేరిలింగంపల్లిలో దూసుకెళ్తున్న బోనాల మహేష్ లడ్డా..!
- దాహార్తిని తీర్చుతూ.. ప్రజల మనసులు గెలుస్తున్న మహేష్ లడ్డా
- పార్టీ అండ లేకపోయినా ప్రజల గుండెల్లో చోటు సంపాదిస్తున్న మహేష్ లడ్డా
- గచ్చిబౌలి బస్తీలకు మంచినీటి భరోసా.. మహేష్ లడ్డా సేవలకు ప్రశంసలు
- సేవతోనే సత్తా చాటుతున్న యువనేత బోనాల మహేష్ లడ్డా





ప్రజా కలం ప్రత్యేకం..

> "నాకు ఏ పార్టీ గుర్తు అక్కర్లేదు.. ప్రజల గుర్తించి సాయం చేసే మనసుంటే చాలు. శేరిలింగంపల్లి ప్రజలే నా కుటుంబం, వారి దీవెనలే నా బలం." -- బోనాల మహేష్ లడ్డా

హైదరాబాద్, మే 28 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రస్తుత రాజకీయాల్లో పార్టీ అండ లేకుండా ఎదగడం అసాధ్యమనే అభిప్రాయాన్ని శేరిలింగంపల్లిలో ఓ యువ నాయకుడు చెదరగొడు తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు అతీతంగా.. కేవలం ప్రజల నమ్మకాన్నే బలంగా చేసుకుని ముందుకు సాగుతున్న యువనేత బోనాల మహేష్ లడ్డా ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాం శంగా మారారు.

ఎలాంటి రాజకీయ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా.. ప్రజల సమస్యలపై నేరుగా స్పందిస్తూ, సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. "పార్టీ కోసం కాదు.. ప్రజల కోసం" అనే భావజాలంతో ఆయన సాగిస్తున్న పర్యటనలకు యువత, సామాన్య ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

**జెండా కాదు.. అజెండా 'సేవ'**

సాధారణంగా రాజకీయ నాయకులు పార్టీ అధిష్టానం మెప్పు కోసం పనిచేస్తుంటే.. మహేష్ లడ్డా మాత్రం ప్రజల అభిమానం కోసం కృషి చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పార్టీల ఆదేశాలు, రాజకీయ పరిమితులు లేకపోవడంతో ప్రజల మధ్యే తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుని వెంటనే స్పందిస్తున్నారు.

నీటి సమస్యలు, కాలనీల్లో పారిశుద్ధ్యం, పేదలకు వైద్య సాయం, విద్యార్థులకు అండ.. ఇలా ప్రతి అంశంలోనూ ఆయన చొరవ చూపుతున్న తీరు స్థానికులను ఆకట్టుకుంటోంది.

**దాహార్తిని తీర్చిన మహేష్ లడ్డా**

వేసవి ఎండలు మండిపోతుండటంతో గచ్చిబౌలి, అంజయ్య నగర్ బస్తీల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని స్థానికుల ద్వారా తెలుసుకున్న మహేష్ లడ్డా వెంటనే స్పందించారు.తన ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసి బస్తీ ప్రజలకు ఉచితంగా మంచినీటిని సరఫరా చేయించారు. ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తాగునీరు అందడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.
ఈ సందర్భంగా మహిళలు, వృద్ధులు మహేష్ లడ్డాకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షధ్వానాలు చేశారు. "అవసర సమయంలో స్పందించి అండగా నిలిచే నాయకుడే నిజమైన ప్రజానాయకుడు" అంటూ కాలనీ వాసులు అభినందించారు.

**ఆపదలో అండగా..**

ఇటీవల ఓ నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర కష్టాల్లో పడగా.. మహేష్ లడ్డా స్వయంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. అంతేకాక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి నైతికంగా కూడా అండగా నిలిచారు. ఈ ఘటన స్థానికంగా విస్తృత చర్చకు దారితీసింది.
"ఫోన్ చేస్తే స్పందించే నాయకుడు" అనే పేరు మహేష్ లడ్డాకు రావడం వెనుక ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**యువతకు కొత్త దారి**

శేరిలింగంపల్లి నియోజకవర్గ యువతలో మహేష్ లడ్డా ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయాల కంటే సామాజిక బాధ్యత ముఖ్యమనే సందేశంతో ఆయన చుట్టూ పెద్ద ఎత్తున యువకులు చేరుతున్నారు.
"మన సమస్యలకు మనమే పరిష్కారం వెతుక్కోవాలి" అనే నినాదంతో యువతను చైతన్యపరుస్తూ.. సేవా కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేస్తున్నారు. దీంతో 'లడ్డా యూత్ ఫోర్స్' పేరుతో ఒక ప్రత్యేక యువజన బలం ఏర్పడిందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.



**ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతున్నారా..?**

ప్రధాన పార్టీల తీరుతో విసిగిపోయిన ఓటర్లకు మహేష్ లడ్డా ఇప్పుడు ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా చదువుకున్న యువత, ఐటీ ఉద్యోగులు ఆయన స్వతంత్ర భావజాలానికి మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది.

పార్టీల మధ్య విమర్శల రాజకీయాలకు దూరంగా ఉంటూ.. సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వడం ఆయనకు ప్లస్ పాయింట్‌గా మారిందని చెబుతున్నారు.

**"ప్రజలే నా బలం"**

"నాకు పార్టీ గుర్తు అవసరం లేదు. ప్రజల ఆశీర్వాదం ఉంటే అదే పెద్ద బలం. శేరిలింగంపల్లి ప్రజలే నా కుటుంబం" అని మహేష్ లడ్డా పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలో ఓ ఇండిపెండెంట్ నాయకుడిగా ఆయన చూపిస్తున్న ప్రభావం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో స్థానిక రాజకీయాల్లో కొత్త సమీకరణాలు కనిపించే అవకాశముందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.









Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com